ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

మంగళవారం 27 అక్టోబర్ 2026 | Tuesday 27 octobar 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 188 | Vol.No 28 Issue No .188 | www.visionandhra.in

# తుమ్మిడిహెట్టిపై చారిత్రక భేటీ!

## 152 మీటర్ల ఎత్తు పెంపుపై సానుకూలత

- ప్రతిపాదనపై పునఃపరిశీలనకు ఫడ్నవీస్ అంగీకారం
- అధికారుల కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదన
- నీటి లభ్యతపై సమగ్ర అధ్యయనం
- ముంపు భూములపై పరిశీలన
- రైతులకు పరిహారంపై చర్చ
- సాంకేతిక, పర్యావరణ అంశాల పరిశీలన
- ప్రత్యామ్నాయ ప్రతిపాదనలకూ అవకాశం
- సీడబ్ల్యూసీ అధ్యయనాలు కొనసాగింపు
- ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రాజెక్టు కీలకం
- గిరిజన ప్రాంతాలకు సాగు, తాగునీరు
- అధ్యయనం తర్వాతే తుది నిర్ణయం





ముంబై: తెలంగాణకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమైంది. బ్యారేజీ ఎత్తును ప్రస్తుత 148 మీటర్ల ప్రతిపాదన నుంచి 152 మీటర్లకు పెంచడం, నీటి లభ్యత, ముంపు ప్రభావం, భూసేకరణ, పరిహారం తదితర అంశాలపై ఇరు రాష్ట్రాల నేతలు చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ద్వారా తుమ్మిడిహెట్టి బ్యారేజీ ప్రాధాన్యతను వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన, ఆదివాసీ ప్రాంతాలు ఇప్పటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయని, అక్కడి ప్రజలకు సాగు, తాగునీటి సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్.బి. చవాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం నుంచి ఈ ప్రాజెక్టు కోసం జరుగుతున్న ప్రయత్నాలను ఆయన వివరించారు. ఐదు దశాబ్దాలుగా వివిధ ప్రతిపాదనలు, చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామని తెలిపారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చడం మిగతా 2లో..

# నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?

- సొంత ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన ఫైర్!
- "చావడానికైనా సిద్ధం.. నా చావుకి రూ. 40 కోట్లు విలువ లేదా?
- నేను బతకాలా.. చావాలా అనేది ప్రభుత్వమే చెప్పాలి"



తెలంగాణ స్టేట్ బ్యూరో,విజన్ ఆంధ్ర, అక్టోబర్ 26: రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపే వ్యాఖ్యలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సొంత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. రోడ్ల నిర్మాణ బిల్లుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న పనులకు బిల్లులు మంజూరు చేయడం లేదని, తద్వారా అభివృద్ధి పనులు స్తంభించిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మిగతా 2లో..

### ఈనాడు చరిత్రలో మొదటిసారి తప్పుడు వార్తపై

# బేషరతు క్షమాపణ!

## కేటీఆర్ లీగల్ నోటీసులకు దిగొచ్చిన ఈనాడు యాజమాన్యం!



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర అక్టోబర్ 26: తెలుగు మీడియా చరిత్రలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ దినపత్రిక ఈనాడు తన పత్రికలో ప్రచురించిన తప్పుడు వార్తపై బేషరతుగా క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.

**అసలు ఏమైంది?**

ఏసీబీ కోర్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాస్‌పోర్ట్ సీజ్ చేయమని ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. కోర్టు అలాంటి ఆదేశాలు ఇవ్వకున్నా, ఇచ్చినట్లు ఈనాడు దినపత్రిక తప్పుడు కథనం ప్రచురించింది. ఈ తప్పుడు మిగతా 2లో..

# పెద్దపల్లిలో పేలుడు!

## శ్రీధర్ బాబు వర్సెస్ గడ్డం వంశీకృష్ణ - ఒకే పార్టీ, రెండు గ్రూపులు!



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 26: పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్‌లో మళ్లీ పాత చిచ్చు రాజుకుంది. ఈసారి మాత్రం అది సామాన్య కార్యకర్తల మధ్య కాదు, నేరుగా మంత్రి స్థాయి నేతకూ, ఎంపీకీ మధ్య జరుగుతున్న పోరు. ఒకవైపు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు. మరోవైపు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ. అధికార పార్టీలో ఉండి, ఒకే జిల్లాలో ఇద్దరు అగ్రనేతలు ఇలా కొట్టుకుంటుంటే కార్యకర్తలు మాత్రం దిక్కుతోచని మిగతా 2లో..

# ఇందిరమ్మ ఇండ్ల ఫైనల్ బిల్లులు త్వరలో జమ చేస్తాం

## ఆడబిడ్డ ఆత్మగౌరవమే ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యం



పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఈ రోజు నేలకొండపల్లిలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన 145 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్, స్థానిక మిగతా 2లో..



# అయ్యగారికి అండగా ఉంటుంది ఎవరు?

## మహిళా అధికారిని బూతులు తిట్టినా చర్యలు లేవు - దేవాదాయ శాఖ మౌనం ఏంటి?

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 26, విజన్ ఆంధ్ర: నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట ప్రసిద్ధ ఆంజనేయస్వామి దేవస్థానంలో తాత్కాలిక పూజారి అడ్డగోలు ఆగడాలు మండలంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. దేవుడి పేరు చెప్పి జలావని చేస్తున్నారని, వెనుక పెద్ద నేతల అండ ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయ్యగారికి మండలంలో ఇద్దరు ముగ్గురు నేతల అండ ఉందని, అందుకే ఆయనకు అండగా ఉంటారని జోరుగా ప్రచారం సాగుతోంది. మండలంలో కొంతమంది ముఖ్య నేతలకు అయ్యగార్లు డబ్బులు అప్పుగా ఇవ్వడంతో, వారే ప్రతిసారి అండగా ఉంటారని ప్రచారం నడుస్తోంది. దాదాపు మండలంలో అయ్యగార్లు ఇచ్చిన అప్పులే కోటికి పైగా ఉంటాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. గ్రామంలో కూడా ఇలాగే అప్పులు ఇస్తూ జలావని చేస్తున్నారని, ఎవరైనా ఎదురు మాట్లాడితే వారి ఇండ్లలో జరిగే శుభకార్యాలకు, అశుభ కార్యాలకు వెళ్లకుండా, వేరే పూజారులను మిగతా 2లో..

# ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు..

- తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు
- ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం అని వ్యాఖ్య



ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ మిగతా 2లో..

# హైదరాబాద్‌లో ఎన్నికల హోరు!

- గ్రేటర్‌లో మూడు కార్పొరేషన్లకు పోలింగ్
- డిసెంబర్/జనవరిలో ముహూర్తం!
- తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు
- స్పెషల్ ఆఫీసర్ల పాలనకు చివరి రోజులు!

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 26, స్పెషల్ స్టోరీ: తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఎన్నికల వేడి రాజుకుంటోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం, డిసెంబర్ చివర్లో లేదా జనవరి మొదటి వారంలో పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఒకప్పుడు ఒక్కటిగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్, ఇప్పుడు మూడు కార్పొరేషన్లుగా మారి, ఆ మూడింటికీ ఒకేసారి ఎన్నికలు జరగబోతున్నాయి. ఇది రాబోయే రోజుల్లో హైదరాబాద్ రాజకీయాలను మార్చే సంచలన పరిణామంగా కనిపిస్తోంది. మిగతా 2లో..

# హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..

## కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర
- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ
- ఎస్ఐఆర్‌పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం
- ఓటర్ల పేర్ల తొలగింపుపై రేవంత్‌రెడ్డికి బీజేపీ నేత సవాల్



తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. మిగతా 2లో..

# ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీం చేసిన పోరాటం చిరస్మరణీయం....

## జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన మహనీయుని ఆశయాల సాధనకు కృషి చేయాలి: మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దనసరి సీతక్క



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర)ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం పోరాడిన అమరుడు కొమురం భీం త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. కొమురం భీం 86వ వర్ధంతి సందర్భంగా సోమవారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, గిరిజనుల ఆరాధ్య దైవమైన అమరజీవి కొమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ మిగతా 2లో..

# ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం

- విజయవాడలో ఎన్టీఆర్ వర్సిటీ 40వ వార్షికోత్సవం
- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడిన ఉపరాష్ట్రపతి



భవిష్యత్తులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్సిటీ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మిగతా 2లో..

# ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు..

## అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- అర్ణబ్ తుపాను ముప్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం
- బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఏపీ తీరానికి రెడ్ అలర్ట్ జారీ
- తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు సూచన



బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని మిగతా 2లో..

## ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం

ఈ సందర్భంగా విద్యా, వైద్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు అందించిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించిన ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కొత్త పరిష్కారాలు కనుగొనేందుకు వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో రాణించాలని సూచించారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, వైద్యులు మానవత్వాన్ని ఎన్నడూ మరువరాదని ఆయన హితవు పలికారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం, ఆత్మీయత చూపడమే వైద్య వృత్తిలో అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దాని దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్యులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు..

పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దాని తీవ్రతకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, వీచే గాలులు, సంభవించే వరద ప్రవాహాల తీవ్రతను ముందుగానే అంచనా వేయాలి. గతంలో వచ్చిన తుపానుల సమాచారాన్ని విశ్లేషించి రైతులకు, ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలి. ఎలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది" అని చంద్రబాబు అన్నారు. తీరప్రాంతాల్లోని ప్రజలను వెంటనే గుర్తించి, సమీపంలోని తుపాను షెల్టర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్ విధానంలో హాజరై తమ జిల్లాల్లోని పరిస్థితులను, తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, 'అర్ణబ్' తుపాను అక్టోబర్ 26 అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, 27న అతి తీవ్ర తుపానుగా బలపడనుంది. అక్టోబర్ 28వ తేదీ ఉదయం బాపట్లవిశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, అందువల్ల ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

## హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..

నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఫైనల్ బిల్లులు త్వరలో జమ చేస్తాం

ప్రజాప్రతినిధులతో కలిసి మంజూరు పత్రాలను అందజేయడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లులన్నింటినీ రాబోయే కొద్ది రోజుల్లోగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు రాలేదని లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందవద్దు. ఇప్పటికే మండలంలో మొదటి విడతలో మంజూరైన 648 ఇళ్లలో 620 పూర్తయ్యాయి. వివిధ కారణాల వల్ల మిగిలిన ఇళ్ల నిర్మాణాలను కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా గత ప్రభుత్వం పేదవారి సొంతింటి కలను నెరవేర్చలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంతిల్లు కట్టించాలన్న గొప్ప సంకల్పంతో మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. అదేవిధంగా హైదరాబాద్ మహానగరంలో 1 లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఇప్పటివరకు 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రతి ఇంటికి రూ. 5 లక్షల చొప్పున రూ. 40 వేల కోట్లను ప్రజా ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ మరో మూడు, నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం. దశాబ్దాలుగా పేదలు కంటున్న సొంతింటి కలను సాకారం చేయడానికి ఇందిరమ్మ ప్రభుత్వం ఇంకా ఎన్ని వేల కోట్లయినా ఖర్చు చేస్తుంది. ఆడబిడ్డ ఆత్మగౌరవమే ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యం.

## ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు..

రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

## ఈనాడు చరిత్రలో మొదటిసారి తప్పుడు వార్తపై బేషరతు క్షమాపణ!

కథనం పాఠకుల్లో తప్పుదోవ పట్టించేలా ఉందని, కేటీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉందని ఆరోపణలు వచ్చాయి.

కేటీఆర్ లీగల్ నోటీసులు!

ఈ తప్పుడు ప్రచురణపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు.వెంటనే ఈనాడు యాజమాన్యానికి లీగల్ నోటీసులు పంపారు. తప్పుడు వార్తను వెంటనే ఉపసంహరించుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన తన లాయర్ ద్వారా నోటీసులు పంపినట్లు తెలిసింది.

దిగొచ్చిన ఈనాడు – బేషరతు క్షమాపణ!

కేటీఆర్ లీగల్ నోటీసులతో దిగొచ్చిన ఈనాడు యాజమాన్యం, తప్పుడు వార్త రాసినందుకు కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణలు చెబుతూ లాయర్ ద్వారా బదులిచ్చింది. "డిజిటల్ మాధ్యమాలలో సహా అన్ని చోట్లా ఈ వార్తను తొలగిస్తున్నామని"లి తమ లాయర్ ద్వారా స్పష్టం చేసింది. ఈనాడు స్థాయిలో ఒక పత్రిక తప్పుడు వార్తపై ఇలా బహిరంగంగా క్షమాపణ చెప్పడం ఇదే మొదటిసారి కావడంతో ఈ ఘటన మీడియా వర్గాల్లో పెను చర్చకు దారితీసింది.

రాజకీయంగా సంచలనం!

ఈ వ్యవహారం ఒక్కసారిగా లిరాష్ట్ర రాజకీయాల్లో, మీడియా వర్గాల్లో సంచలనంగాలి మారింది. తప్పుడు వార్తలపై న్యాయపరంగా పోరాడితే మీడియా కూడా దిగిరావాల్సిందేనని ఈ ఘటన స్పష్టం చేసిందని బీఆర్ఎస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

## ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీం చేసిన పోరాటం చిరస్మరణీయం....

కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరుస్తామని తెలిపారు. రాబోయే బడ్జెట్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిరిజనులకు సంబంధించిన జీఓల అమలుపై వచ్చిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. సంబంధిత జీఓల అమలుకు పూర్తి స్థాయి అధికారిక ఉత్తర్వులు త్వరలో జారీ చేసే బాధ్యతను గిరిజన సంక్షేమ శాఖ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఐటీడీఏలకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడతామని అన్నారు. గిరిజనుల అటవీ సమస్యలను పరిష్కరిస్తూ ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన గిరిజనులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులకు అందుతున్న కాస్మెటిక్, డైట్ ఛార్జీలను పెంచడంతో పాటు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతాల్లో ఆదివాసీలు, గిరిజనులకు అందుతున్న సంక్షేమ ప్రయోజనాలు, అటవీశాఖ అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీని పంపిస్తామని తెలిపారు. అక్కడ అమలవుతున్న మంచి విధానాలను పరిశీలించి, అవసరమైన వాటిని రాష్ట్రంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక కొమురం భీం: మంత్రి సీతక్క

మంత్రి దనసరి సీతక్క మాట్లాడుతూ, జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన వీరుడు కొమురం భీం ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. కొమురం భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సమ్మక్కసారలమ్మ, బిర్సా ముండా వంటి మహనీయుల పోరాట స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అధికారులు మానవత్వంతో, అంకితభావంతో వ్యవహరించాలని సూచించారు. ఆదివాసీల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. యువత విద్యపై దృష్టి సారించి ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ జిల్లాలో సుమారు 8 వేల ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు లభించిందని, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, ఇళ్లు, తాగునీరు, విద్యుత్, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్లు, రహదారుల అభివృద్ధికి రూ.180 కోట్లతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ.. కొమురం భీం ఆదివాసీల ముద్దుబిడ్డ, జాతిరత్నమన్నారు. జల్, జంగల్, జమీన్ కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని గిరిజన ప్రాంతాల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు గిరిజనులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్టీఎఫ్‌డీ, జన్‌మన్, ఆర్టికల్ 275(1) తదితర కేంద్ర నిధులను గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించాలని కోరారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కొమురం భీం తన ప్రాణాలను సైతం అర్పించారని అన్నారు. గిరిజనుల అటవీ సమస్యలను పరిష్కరించడంతో పాటు మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని కోరారు. కొమురం భీం ఆశయాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్, సిర్పూర్, కాగజ్‌నగర్, ఖానాపూర్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్, వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన యోధుడు కొమురం భీం ఆశయాల సాధనకు కృషి చేయాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో రహదారులు, రవాణా, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరీత మాట్లాడుతూ.. కొమురం భీం పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను పరిరక్షిస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి నిరంతరం తాగునీరు అందించేందుకు కెరమెరి సమీపంలో రూ.60 కోట్లతో ఇంటెక్‌వెల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఎస్పీ నిఖితా పంత్ మాట్లాడుతూ.. కొమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పిల్లలను చదివించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. గిరిజన ప్రజల అభివృద్ధికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. గిరిజన గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే కొమురం భీంకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరందు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గోండి భాషలో ప్రసంగిస్తూ గిరిజన ప్రజలను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గుస్సాడీ, చిన్నారుల సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో భాగంగా మంత్రులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అందజేశారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు.ముందు గా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్ లను మంత్రులు, అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో కొమురం భీం మనుమడు కొమురం సోనే రావు, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ జోయల్, ప్రజాప్రతినిధులు, గిరిజన ప్రజలు, వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యగారికి అండగా ఉంటుంది ఎవరు?

తెచ్చుకున్నా వారిని రానీయకుండా అడ్డుకుంటారనే చర్చ జోరుగా జరుగుతోంది. ఇప్పుడు ప్రజలు అడుగుతున్నారు అయ్యగారికి అండగా ఉంటుంది ఎవరు?

ఎన్ని దారుణాలు జరుగుతున్నా ఆయనను కాపాడుతున్నది ఎవరు?

ఆయనని ఎందుకు కాపాడాల్సి వస్తుంది?

మహిళా అధికారిని దూషించి బూతులు మాట్లాడిన పూజారిని ఎందుకు శిక్షించడం లేదు? ఎందుకు చట్టపరంగా చర్యలు తీసుకోవట్లేదు?

మహిళల పట్ల ఇంత అమానుషంగా ప్రవర్తించిన పూజారి పైన ఎందుకు చర్యలు లేవు? మహిళలంటే అంత చులకననా?

మండలం మొత్తం చర్చించుకుంటున్న అసలు నిజం ఏంటి?

మండలం మొత్తం ప్రజలు చర్చించుకుంటున్న ఈ విషయాలు వాస్తవమేనా లేక కల్పితాలా అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. ఒకవేళ వాస్తవాలే అయితే – ఎన్నిసార్లు పూజారి మీద రిమార్కులు వచ్చినా, పత్రికాముఖంగా, టీవీ ఛానల్ లో వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు అని ప్రజలు నిలదీస్తున్నారు.

ఒకవేళ కల్పితాలే అయితే – పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి, ఈ వార్త జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించినా, దేవాదాయ శాఖ ఎందుకు మౌనంగా ఉంది? పూజారిపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు? అని మరో ప్రశ్న తలెత్తుతోంది. మహిళా ఉద్యోగి పై బూతు మాటలు కురిపించిన అతనిపై ఇప్పుడే యాక్షన్ లేకపోతే, రేపు భవిష్యత్తులో మహిళలపై చేయి చేసుకున్నా ఎటువంటి యాక్షన్ తీసుకోరా? అంటూ ప్రజలు సెటైర్లు వేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు యాక్షన్ తీసుకుంటారా? లేదా?

ఊరుకొండ మండలం మొత్తం ఈ ప్రశ్నతోనే మారుమ్రోగుతోంది.

## హైదరాబాద్‌లో ఎన్నికల హోరు!

ఎందుకు ఇంత ఆలస్యం అయింది?

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) పాలకమండలి పదవీకాలం చాలా కాలం క్రితమే ముగిసింది. అయినప్పటికీ ఎన్నికలు జరగలేదు. పాలనంతా లిస్పెషల్ ఆఫీసర్ల చేతుల్లోనేలి కొనసాగుతోంది. మధ్యలో ప్రభుత్వం జిహెచ్ఎంసి ని మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది – హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి. ఈ విభజన, వార్డుల పునర్విభజన, వార్డుల సంఖ్య పెంపు, బీజ రిజర్వేషన్లపై కోర్టుల్లో వివాదాలు నడుస్తుండటంతో ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయింది. ఇప్పుడు ఆ అడ్డంకులను అధిగమించి ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది.

ప్రభుత్వ ప్లాన్ ఏమిటి?

రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించింది. ప్రణాళిక ప్రకారం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లు – GHMC, సైబరాబాద్, మల్కాజిగిరిలకు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా 5,773 వీుజ మరియు 566 ,ౌుజ స్థానాలకులి స్వల్ప వ్యవధిలోనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ Invest Telangana Global Summit తర్వాత, డిసెంబర్ మొదటి వారంలోలి ఖరారయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని యోచిస్తున్నారు. ప్రభుత్వం ఉద్దేశ్యం స్పష్టంగా ఉంది – గ్రామీణ స్థాయిలో ఎన్నికైన ప్రజాప్రతినిధులను తీసుకురావడం, స్పెషల్ ఆఫీసర్ పాలనకు స్వస్తి పలకడం, ఫైనాన్స్ కమిషన్ నిధులను పొందడం మరియు తదుపరి అసెంబ్లీ బడ్జెట్ సమావేశానికి ముందు ఈ ప్రక్రియను పూర్తి చేయడం.

ఓటర్ల జాబితానే కీలకం!

ఎన్నికల నిర్వహణకు అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. నవంబర్ 9 నాటికి తుది ఓటర్ల జాబితాను విడుదలలి చేయనున్నారు. తుది జాబితా రాగానే రాష్ట్ర ఎన్నికల సంఘం వార్డులు, గ్రామాల వారీగా డేటాను విభజించి, రిజర్వేషన్లు ఖరారు చేసి, పోలింగ్ కేంద్రాలను నోటిఫై చేస్తుంది. నవంబర్ రెండో వారంలోగా జాబితా చేతికి రాగానే తదుపరి నోటిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ముఖ్యమంత్రి ఇటీవల మల్కాజిగిరిలో రూ. 1,511 కోట్ల, సైబరాబాద్‌లో రూ. 1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించి, పరోక్షంగా ఎన్నికల శంఖారావం పూరించారనే చర్చ కూడా జరుగుతోంది.

అన్ని పార్టీలకు అగ్నిపరీక్ష!

ఈ ఎన్నికలు ముఖ్యంగా కాంగ్రెస్‌కు అగ్నిపరీక్ష కానున్నాయి. గతంలో 2016, 2020 GHMC ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, గ్రేటర్ పరిధిలో ఒక్క అసెంబ్లీ స్థానంలోనూ గెలవలేదు. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఖాతా తెరవలేకపోయింది. అయితే సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచిన తర్వాత కాంగ్రెస్ నాయకత్వంలో కొంత నమ్మకం పెరిగింది. మరోవైపు బిఆర్ఎస్, బీజేపీ, ఏఐఎంఐఎం పార్టీలు కూడా హైదరాబాద్‌ను తమ కోటగా భావిస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయి ఏర్పాట్లపై దృష్టి సారించాయి. హైదరాబాద్ రాజకీయాల్లో మరోసారి ఎన్నికల వేడి మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అధికారిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కోసం రాష్ట్రమంతా ఎదురుచూస్తోంది!

## పెద్దపల్లిలో పేలుడు!

స్థితిలో ఉన్నారు.

కార్యకర్తగానూ చూడట్లేదా?

వంశీకృష్ణ అనుచరుల మాటల్లో చెప్పాలంటే – "ఎంపీ గడ్డం వంశీకృష్ణని కనీసం పార్టీ కార్యకర్తగా కూడా చూడట్లేదు." పార్టీ అధికారిక కార్యక్రమాలు జరుగుతున్నా, ఆ కార్యక్రమాలకు వంశీకృష్ణకు ఆహ్వానం పంపడం లేదట. ఎంపీ స్థాయి నేతను పిలవకుండా, పక్కన పెట్టడం వెనుక శ్రీధర్ బాబు వర్గం కుట్ర ఉందని వారు ఆరోపిస్తున్నారు. ఈ అవమానాన్ని భరించలేక వంశీకృష్ణ వర్గం కూడా ప్రతిఘటన మొదలుపెట్టింది. శ్రీధర్ బాబు వర్గంపై సోషల్ మీడియాలో నెగటివ్ కామెంట్స్ పెట్టిస్తున్నారనే ప్రచారం జిల్లాలో బలంగా వినిపిస్తోంది. బయటకు నవ్వుతూ మాట్లాడుకున్నా, లోపల మాత్రం సోషల్ మీడియా యుద్ధం నడుస్తోంది.

గడ్డం ఫ్యామిలీ ఒంటరిదా?

జిల్లాలో ఇప్పుడు ఒక చర్చ బలంగా సాగుతోంది. గడ్డం ఫ్యామిలీని రాజకీయంగా కట్టడి చేయడానికి ఒక జట్టు ఏర్పడిందని. ఆ జట్టులో మక్కన్ సింగ్, విజయ రమణారావు, అడ్లూరి లక్ష్మణ్, శ్రీధర్ బాబు ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అంటే పెద్దపల్లిలో గడ్డం ఫ్యామిలీకి వ్యతిరేకంగా సీనియర్ నేతలంతా ఒకవైపు నిలబడ్డారా అనే అనుమానం కార్యకర్తల్లో మొదలైంది.

ఇది కొత్తది కాదు, పాత కథే!

రాజకీయ పరిశీలకులు చెబుతున్న మాటేమిటంటే, ఈ గొడవకు ఇది మొదలు కాదు. గతంలో వీ6 వివేక్, శ్రీధర్ బాబు మధ్యలోనూ ఇలాంటి విభేదాలే వచ్చాయి. అదే క్రమంలో ఇప్పుడు వంశీకృష్ణతోనూ కొనసాగింపులిగా ఈ విభేదాలు బయటపడ్డాయి. అందుకే జిల్లాలో ఒక మాట బలంగా వినిపిస్తోంది – "సొంత పార్టీ సీనియర్ నాయకులతో విభేదాలు పెట్టుకోడమే పనిగా పెట్టుకున్నారు" అని, అది వీ6 వివేక్ ఫ్యామిలీపై వస్తున్న విమర్శ. నిజమే, మొన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుతో గొడవ, నేడు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లతో విభేదాలు – అన్నీ ఒకదాని తర్వాత ఒకటి అదే పంథాలో జరుగుతున్నాయని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

అంత్యం ఏమిటి?

ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. పార్టీపై నమ్మకం తగ్గుతున్న ఈ సమయంలో నాయకుల మధ్య ఈ గ్రూప్ తగాదాలు పార్టీని మరింత బలహీనపరుస్తున్నాయి. గ్రూప్ పాలిటిక్స్‌తో కాంగ్రెస్ పూర్తిగా భూస్థాపితం అవుతుందనే ఆందోళన స్థానిక కార్యకర్తల్లో స్పష్టంగా కనిపిస్తోంది. నాయకులు తమ పైచేయి కోసం పోట్లాడుకుంటున్నారు, కానీ పార్టీ మాత్రం రోజురోజుకు కోలుకోలేని దెబ్బ తింటోంది.

## తుమ్మిడిహెట్టిపై చారిత్రక భేటీ!

కష్టమని వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, పంపింగ్ వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు, ప్రాజెక్టు నిర్వహణ ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటే 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడం ప్రయోజనకరమని ప్రతిపాదించారు. గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్ర భూసేకరణ నిబంధనలు, పరిహార విధానం ప్రకారం నష్టపరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

ఆదిలాబాద్ అభివృద్ధికి కీలకం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన 'జల్, జంగల్, జమీన్' పోరాటాన్ని గుర్తుచేస్తూ, ఆ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీటి సదుపాయాలు కల్పించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రవాణా సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి వారధిగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.

అధ్యయనానికి అధికారుల కమిటీ

తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. బ్యారేజీ ఎత్తును పెంచాలన్న అభ్యర్థనను పునఃపరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, మహారాష్ట్ర ప్రజలకు, రాష్ట్రానికి ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని స్పష్టం చేశారు. తుది నిర్ణయానికి ముందు సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలపై సమగ్ర అధ్యయనం అవసరమని పేర్కొన్నారు. ఇందుకోసం ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూముల విస్తీర్ణం, భూసేకరణ, పరిహారం తదితర అంశాలను కమిటీ పరిశీలించనుంది. అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను కూడా అధ్యయనం చేసి, తదుపరి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పరిధిలోనూ అధ్యయనాలు కొనసాగనున్నాయి. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు పరస్పర సంప్రదింపులు జరిపి తదుపరి సమావేశాలు, కాలపరిమితులను నిర్ణయించనున్నారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి ఫలాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి ప్రాధాన్యం ఇవ్వాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభిప్రాయపడ్డారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై తదుపరి నిర్ణయాలు అధికారుల అధ్యయనం, సాంకేతిక నివేదికల ఆధారంగా ముందుకు సాగనున్నాయి.

## నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?

మాట్లాడుతూ, "నేను చనిపోతేనే బిల్లులు వస్తాయంటే చావడానికైనా సిద్ధం! నా చావుకి రూ. 40 కోట్లు విలువ లేదా? నేను బతికి ఉండాలా లేదా చనిపోవాలా అనేది ప్రభుత్వమే నిర్ణయించాలి!" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. తన మాటల్లోని ఆవేదన, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. ప్రజా ప్రతినిధిగా తాను ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని పరిస్థితి ఏర్పడితే, ఆ బాధ ఎంతటిదో ఆయన మాటల్లో ప్రతిబింబించింది.

రోడ్లు పూర్తి చేయకుంటే 30 వేల మందితో దీక్ష!

జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పనుల కోసం సుమారు రూ. 40 కోట్ల బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని చెప్పారు. ఆ బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి వచ్చిందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. "నా నియోజకవర్గంలో రోడ్లు పూర్తి చేయకుంటే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేస్తా" అని ఆయన హెచ్చరించారు. ఇది కేవలం హెచ్చరిక మాత్రమే కాదు, తన నియోజకవర్గ ప్రజల సమస్యల పట్ల తనకున్న నిబద్ధతను తెలియజేసే ప్రకటన అని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని, ప్రజల తరపున పోరాడుతానని ఆయన చెప్పారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆ హామీ మేరకు ఇప్పటివరకు బిల్లులు మంజూరు కాకపోవడంతోనే తాను ఈ విధంగా స్పందించాల్సి వచ్చిందని ఆయన వివరించారు. మంత్రుల హామీలు నెరవేరకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

కేవలం మంత్రులకే బిల్లులు? మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటి?

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వంపై పలు ప్రశ్నలు సంధించారు. "కేవలం మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు చెల్లిస్తారా? మరి మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటి? మా నియోజకవర్గాల్లో అభివృద్ధి జరగదా? మా ప్రజలు పన్నులు చెల్లించడం లేదా?"లి అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రశ్నల ద్వారా రాష్ట్రంలోని అనేక మంది ఎమ్మెల్యేల్లో ఉన్న ఆందోళనను ఆయన ప్రతిబింబించారు. ఒకవేళ నిధులు పరిమితంగా ఉన్నా, వాటిని సమానంగా, న్యాయంగా పంపిణీ చేయాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలందరూ ఇదే పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక కాంట్రాక్టర్ చనిపోతే ప్రభుత్వం వెంటనే ఆయనకు రూ. 5 కోట్ల బిల్లు మంజూరు చేసిందని ఆయన ఉదాహరణగా చెప్పారు. ఆ సంఘటనను ఉదహరిస్తూ, "అలాగైతే నా నియోజకవర్గ పనుల బిల్లుల కోసం నేనే చస్తేగానీ నిధుల బిల్లులు మంజూరు చేయరా? నా చావుతోనే స్పందిస్తారా?"లి అని ఆవేదనతో ప్రశ్నించారు. "నా చావుతోనే స్పందిస్తారా? నేను బతికుండాలా లేదా చనిపోవాలా అనేది ప్రభుత్వం నిర్ణయించాలి" అని ఆయన అన్న మాటలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే ఇంత బహిరంగంగా, తీవ్రంగా ప్రభుత్వంపై విమర్శలు చేయడం అనేది సాధారణ విషయం కాదు. దీనిని ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా వాడుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి, పెండింగ్ బిల్లులపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తాయో చూడాలి.

# సంపాదకీయం

## సోనియాగాంధీ బయోగ్రాఫీ వివాదాలు

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు.. రాజ్యసభ సభ్యురాలు సోనియాగాంధీ తన సుదీర్ఘ రాజకీయ చరిత్ర.. జీవిత ప్రయాణంలో అనుభవాలను ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ఆమె ఒక ఆత్మ కథ కూడా రాశారు. దానికి బిలాంగింగ్ జర్నీ ఆఫ్ లవ్ పేరు పెట్టారు. ఈ పుస్తకాన్ని వచ్చేనెల 10వ తేదీన విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో సోనియాగాంధీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ చేశారు.కేం బ్రిడ్జిలోని ఒక చిన్న గ్రీక్ రెస్టారెంట్లో సోనియాగాంధీ, రాజీవ్ గాంధీకి మధ్య ప్రేమ ప్రయాణం మొదలైంది. నాడు వారిద్దరు అక్కడ తరచుగా కలుసుకునేవారు. ఎన్నో తీపి జ్ఞాపకాలు.. ఎన్నో యువతీ దేశంలో అడుగుపెట్టడం.. నెహ్రూ.. గాంధీ కుటుంబాలలో కోడలిగా.. ముఖ్యమైన వ్యక్తిగా ఇమిడిపోవడం వంటి విషయాలను ఆమె అక్షరీకరణ చేశారు.కేవలం తమ ప్రేమకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే ఇందులో సోనియాగాంధీ ప్రస్తావించలేదు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో నెహ్రూ కుటుంబం పడిన ఇబ్బందులు.. గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు.. దేశ రాజకీయాలలో ఈ రెండు కుటుంబాలు పోషించిన పాత్ర వంటి వాటిపై ఈ పుస్తకంలో సోనియాగాంధీ వివరించారు. 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురి కావడం.. 1991లో రాజీవ్ గాంధీ దుర్మరణం చెందడం వంటి దారుణాలు జరిగినప్పుడు తాను ఎదుర్కొన్న విషాదం.. అనుభవించిన మానసిక వేదనను సోనియాగాంధీ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. తన కళ్ళ ముందు రక్త సంబంధాలు విచ్ఛిన్నం కావడం.. పిల్లలు రాహుల్.. ప్రియాంకను చూసుకుంటూ.. ఒంటరిగా ఆమె సాగించిన రాజకీయ ప్రయాణాన్ని ఇందులో ప్రస్తావించినట్టు తెలుస్తోంది.సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక కాలం అధ్యక్షురాలిగా పని చేశారు. 1990 చివరి కాలంలో రాజకీయాల్లోకి సోనియా గాంధీ బలవంతంగా వచ్చారు. ముఖ్యంగా 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు.. ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ.. దానిని తిరస్కరించిన విధానం.. మన్మోహన్ సింగ్ ఎంపిక.. రెండు పర్యాయాలు కేంద్రంలోకి అధికారంలోకి రావడం.. కీలకమైన సమాచార హక్కు చట్టం.. ఉపాధి వంటి పథకాలను అమలు చేయడం మట్టి విషయాలను సోనియాగాంధీ ఇందులో ప్రస్తావించారు.ఇక ఈ పుస్తకం ప్రచురణకు ముందు పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ తో వచ్చిన వివాదాలు.. మధ్యలోకి హార్పర్ కాలిన్స్ సంస్థ రావడం.. వంటి పరిణామాలు ఈ పుస్తకానికి మరింత ప్రచారం తీసుకొచ్చాయి..సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్.. ఏ జర్నీ ఆఫ్ లవ్' నవంబర్ 10వ తేదీన విడుదల కానుంది.. అయితే బుక్ రిలీజ్ అయిన తర్వాత దేశ రాజకీయాలలో ఎటువంటి మార్పులు చోటు చేసుకోబోతాయో చూడాల్సి ఉంది.ఇంతలోనే వారందరికీ షాక్ ఇస్తూ భారత్‌లో తాము ఆ గ్రంథాన్ని ప్రచురించటం లేదని 'పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా' సంస్థ శుక్రవారం ప్రకటించింది. పుస్తకంలో కొన్నిచోట్ల తాము సూచించిన మార్పులు చేసేందుకు రచయిత (సోనియాగాంధీ) అంగీకరించలేదని, అందువల్లే భారత్‌లో ఆ గ్రంథం ప్రచురణ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు వెల్లడించింది. 'గ్రంథంలోని అంశాల వాస్తవికతను పరిశీలించి రచయితకు పలు సూచనలు ఇవ్వటం పబ్లిషర్‌గా మా బాధ్యత. ప్రచురణ ప్రక్రియలో ఇది సాధారణ అంశం' అని పేర్కొందిపెంగ్విన్ సంస్థ ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ భగ్గుమంది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను ఆ సంస్థ చంపేసిందని కాంగ్రెస్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ మండిపడ్డారు. 'సోనియాగాంధీ ఆత్మకథ గ్రంథాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచురించేందుకు పెంగ్విన్ రాండమ్ కంపెనీ సిద్ధంగా ఉంది. కానీ, భారత్‌లో దాని అనుబంధ సంస్థ అయిన పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా మాత్రం ఆ గ్రంథంలో మార్పులు చేయాలని కోరుతోంది. అందుకు కారణమేంటి? ఆ సంస్థ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గింది? త్యాగం, నిబద్ధతకు సోనియాగాంధీ జీవితం ఉదాహరణ. దేశానికి ఆమె అసాధారణ సేవ చేశారు. అలాంటి గొప్ప నాయకురాలి ఆత్మకథను రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రచురించకుండా తప్పుకోవటం భావప్రకటనా స్వేచ్ఛను హత్యచేయటమే. నరేంద్రమోదీ పాలనలో భారత భూభాగాన్ని చైనా ఆక్రమించటం, మోదీ పాలన, ఆరెస్సెస్ కు సంబంధించి ఎడిటోరియల్‌లోని అంశాలను తొలగించాలని పెంగ్విన్ ఇండియా కోరింది. ఆ అంశాలను తొలగించేలా చూడాలని మోదీ ప్రభుత్వం పబ్లిషర్‌పై ఒత్తిడి తెచ్చిందా?' అని గెహ్లోత్ ప్రశ్నించారు. పెంగ్విన్ సంస్థ నిర్ణయం ఆందోళనకరమని మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ అన్నారు. ఆరెస్సె?సపై గ్రంథాలు ప్రచురించిన పెంగ్విన్ సంస్థ.. సోనియా ఆత్మకథ ప్రచురణ నుంచి తప్పుకోవటానికి చూపిన కారణం బలంగా లేదని లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ విమర్శించారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. సోనియాగాంధీ తన జ్ఞాపకాలు, అనుభవాలను పుస్తక రూపంలో తెస్తున్నప్పుడు.. వాటిలో కొన్ని కల్పనలు కూడా ఉండవచ్చు కదా? అని బీజేపీ నేత అమిత్ మాలవీయ ప్రశ్నించారు. వాటిని సరిచూసుకోవాలని పబ్లిషర్ చెప్పటంలో తప్పేముందని నిలదీశారు.ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల వేళ జగన్ ట్రాప్ లో టీడీపీ పడినట్లే కనిపిస్తుంది. జాతీయ స్థాయిలో నామినేషన్ల కేంద్రాల వద్ద జరిగిన చర్చనీయాంశమైంది. జాతీయ మీడియాతో పాటు సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెర్స్ కూడా ఈ ఘటనపై టీడీపీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఎన్డీఏ కూటమిలో టీడీపీ ఉండటంతో జాతీయ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలు, నామినేషన్ల చించివేత ఘటనలు నేషనల్ లెవెల్ లో హైలెట్ గా నిలిచాయని చెప్పాలి. జగన్ కోరుకున్నదిదే. జగన్ అనుకున్నదిదే. అందుకే జగన్ తన అభ్యర్థులను బరిలోకి దింపాలని పార్టీ నేతలకు తెలిపారు. ఈ ఘటనలతో టీడీపీతో పాటు కూటమిలో ఉన్న బీజేపీ వైపు కూడా కొందరు దోషిగా చూడటం మొదలు పెట్టారు. ఇది జగన్ కు ప్లస్ కాగా, టీడీపీకి మైనస్ గా మారింది. బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా ఈ ఘటనలతో కొంత ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. జగన్ వేసిన ట్రాప్ లు సునాయాసంగా టీడీపీ పడిపోయిందన్న రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పర్వంలో చోటుచేసుకున్న ఘర్షణలు, రాజకీయ వ్యూహాల వల్ల ప్రస్తుతం ఈ అంశం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. జగన్ మోహన్ రెడ్డి వ్యూహాత్మకంగా వేసిన ట్రాప్‌లో టీడీపీ పడిందా లేదా అనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు వైసీపీ నేతలను ముందస్తు అరెస్ట్ లు చేయడం, నామినేషన్ల కేంద్రాల్లోకి చొరబడి ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను చింపివేయడం, వాహనాల దగ్ధం, పోలీసు కాల్పులు, రాళ్ల దాడులు వంటివి జాతీయ స్థాయిలో హైలెట్ అయ్యాయి..

## పేదోడి ఓటును కాపాడుకుంటేనే రాజ్యాంగాన్ని కాపాడుకున్నట్లు

### ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్రపూరిత ఆలోచనా విధానానికి స్వస్తి పలకాలి

### రాష్ట్ర తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి




నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర)పేదోడి ఓటును కాపాడుకుంటేనే రాజ్యాంగాన్ని కాపాడుకున్నట్లు , భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు . ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఆ హక్కును హరించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని తేల్చి చెప్పారు . నారాయణపేట లో 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూదేశంలో మరోసారి అధికారంలోకి రావడానికి బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని మంత్రి విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కోట్లాది ఓట్లను తొలగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, అర్హులైన ఒక్క ఓటరుకూ అన్యాయం జరగకూడదని అన్నారు. బీజేపీ ఓట్ల తొలగింపుపై అనుసరిస్తున్న విధానానికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారుడాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించిందని మంత్రి గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓటు వేయడం కేవలం బాధ్యత మాత్రమే కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో మన గొంతును వినిపించే శక్తి అని పేర్కొన్నారు. ఓటు హక్కు కోల్పోతే ప్రజాస్వామ్యంలో పౌరుడి భాగస్వామ్యం తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ఓటు హక్కును కాపాడుకోవడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.దేశంలో అనేక కీలక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల సంక్షేమానికి కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు . పేదల హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ప్రజల ఓటుతో ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ఓటు హక్కుకు విఘాతం కలిగించే ఏ ప్రయత్నాన్నైనా ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు .నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావో -- దేశ్ బచావో' నిరసన సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం జరిగే ఈ పోరాటాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.కులగణన చేపట్టి సామాజిక న్యాయం దిశగా ధైర్యంగా ముందడుగు వేసిన నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మంత్రి కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన సమాచారం అవసరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమాన అవకాశాలు, సామాజిక న్యాయం లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు.రాబోయేపాలమూరు--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డిని గెలిపించే బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని మంత్రి శ్రీహరి అన్నారు. ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడం, కాంగ్రెస్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయడం ద్వారా లక్ష్యాన్ని సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఏఐసీసీ పరిశీలకులు రవీంద్ర దాస్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూముల వివరాల నమోదు కోసమే సర్వే -తహసీల్దార్ అశోక్ కుమార్



ఊట్కూర్, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర)ప్రభుత్వం రైతుల భూములకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేసి, భూ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న భూభారతి రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని ఊట్కూర్ తహసీల్దార్ అశోక్ కుమార్ కోరారు. సోమవారం ఊట్కూర్ మండల పరిధిలోని పెద్దపోర్ల గ్రామపంచాయతీ శివారు గ్రామమైన జీర్ణహళ్లిలో భూభారతి రీ సర్వేపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ కుమార్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన వివరాల నమోదు, భూ హద్దుల నిర్ధారణ వంటి అంశాల్లో రీ సర్వే కీలకమని తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సర్వే సిబ్బందికి సరైన వివరాలు అందించి, భూముల కొలతలు చేపట్టే సమయంలో సహకరించాలని కోరారు. భూములకు సంబంధించిన వివరాల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూభారతి రీ సర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు రైతులు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశమ్మ, ఆర్ ఐ వెంకటేష్, మండల సర్వేయర్ జయశంకర్, జిపిఓ నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తుంగతుర్తి రవి జన్మదిన వేడుకలు

### బండి కన్వెన్షన్‌లో జనసందోహం

### రవి జన్మదిన వేడుకలకు పోటెత్తిన కాంగ్రెస్ శ్రేణులు!



బోడుప్పల్,అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి జన్మదిన వేడుకలు బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బండి కన్వెన్షన్‌లో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరుకాగా, జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కన్వెన్షన్ ప్రాంగణం సందడిగా మారిందిఈ సందర్భంగా తుంగతుర్తి రవికి నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. తుంగతుర్తి రవి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు, పార్టీకి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. అభిమానులు, పార్టీ శ్రేణుల మధ్య వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

## వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం

### జిల్లా కలెక్టరేట్లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్లో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు అధికారులు, బోయ వాల్మీకి సంఘం నేతలతో కలిసి కలెక్టర్ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ గ్రంథాన్ని రచించి లోకానికి పరిచయం చేసిన మహనీయుడు వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని అన్నారు. వాల్మీకి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఎక్కువగా ఉన్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వీరికి కులవృత్తి లేనప్పటికీ వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని, బోయ అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా జీవనోపాధికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. బోయ వాల్మీకులు తమ పిల్లలను బాగా చదివించాలని, విద్య తోనే ఏ రంగంలోనైనా రాణించవచ్చని తెలిపారు. మహర్షి వాల్మీకి రచించిన రామాయణంలో సకల సద్గుణాలతో సీతారాముల జీవితాన్ని వర్ణించడం జరిగిందన్నారు. సనాతన భారతీయ గ్రంథాల్లో రామాయణం ముకుటాయమానంగా నిలుస్తుందని, మనిషి నైతిక విలువలతో జీవించడానికి దోహదపడుతుందని కొనియాడారు. ఇంత గొప్ప గ్రంథాన్ని రచించిన మహర్షి వాల్మీకి జీవిత చరిత్ర భావితరాలకు తెలియజేసేందుకు జయంతి కార్యక్రమం దోహదపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు (స్థానిక సంస్థలు), ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, పలువురు వాల్మీకి సంఘ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 26, ( విజన్ ఆంధ్ర) :సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున, ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, పశువుల సంరక్షణ, వైద్య శిబిరాల నిర్వహణ, వ్యవసాయ ప్రణాళిక, విద్యుత్ సరఫరా అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి సమస్యలను గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రానున్న రబీ సీజన్‌లో వేరుశెనగ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఆడియో, వీడియో మాధ్యమాల ద్వారా వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు సూచనలు అందించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, ఓవర్‌లోడ్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 39, ఇతర శాఖలకు సంబంధించి 37, మొత్తం 76 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్ర రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైతుపై దాడి చేసిన ఎస్ఐ ని అటాచ్ చేయడం కాదు సస్పెండ్ చేయాలి

### రేపాక రాజు డిమాండ్




సిద్దిపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర)గజ్వేల్ నియోజకవర్గంలోనిచిగురుపల్లి గ్రామానికి చెందిన రైతు భీమరి రవి రైతుపై చెయ్యి వేసుకున్న రవి పోలీస్ స్టేషన్ లో తీర్పు చెప్పడానికి వస్తే మల్లారెడ్డి అనే ఎస్ఐ గారు చేయి వేసుకోవడం పై చేయి వేసుకున్నదే కాకుండా అతడు అతడు రక్తం కారుతున్న గాని పోలీస్ స్టేషన్లో నిల్పో పెట్టినాడు అందుకు రక్షణ కావాలని రైతు రక్షక బిడ్డల దగ్గరికి వస్తే బాక్సించడమేందని నంది ఖండిస్తున్నాము ఎస్సైని హెడ్ క్వార్టర్ కు అటాచ్ చేయడం అనేది సాధారణ శిక్ష మాత్రమేనని న్యాయం కోసం వచ్చిన సామాన్య రైతుపై దోస్తీకానికి పాల్పడినందుకు చైనీ మల్లారెడ్డిని వెంటనే సస్పెండ్ ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని ఆయనపై క్రిమినల్ కేసు పెట్టాలని పూర్తిస్థాయి విచారణ జరపాలని ఏ ఐ ఎఫ్ బి గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులు శ్రీ రేపాక రాజు అన్నారు పోలీస్ స్టేషన్లో సామాన్య ప్రజలకు భయభ్రాంతులను కల్పించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు ఇలాంటి దాడులకు పాల్పడితే పాలు పడితే సహించేది లేదని బారుదుడికి పూర్తి న్యాయం జరగాలని గజ్వేల్ నియోజకవర్గం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులు రేపాక రాజు డిమాండ్ చేయడం జరిగింది

## సమయాపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు

### విద్యభ్యాసానికి ఆటంకం కలుగుతుందని విద్యార్థుల అవేధన



కృష్ణ, అక్టోబర్ 26( విజన్ ఆంధ్ర) సమయా పాలనను ఆర్టీసీ బస్సులు పాటించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు సమయానికి తరగతి గదులకు చేరుకోవడానికి అంతరాయం ఏర్పడి విద్యాభ్యాసం కూడా ఆటంకాలు కలుగుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలోని కృష్ణ మండలంలోని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు సమయానికి రాకా విద్యార్థులు మాగనూరు,మక్తల్ లో ఉన్న ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో విద్యను,అభ్యసించడానికి వెల్లాల్సి వస్తుంది.ఆయా సంస్థలలోని తరగతులకు వెళ్లే చాలా మంది విద్యార్థులు కాలినడకతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది అదేవిధంగా మండలంలో సరైన రవాణా సదుపాయాలు లేవు, దీంతో విద్యార్థులు విద్యా తరగతులకు సమయానికి బస్సు అందుబాటులో లేకపోవడం వల్ల చదువుకు దూరం కావడంతో పాటు ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు వినకపోవడంతో చదువులు అర్థం కావటం లేదని భాదపడుతున్నారు.బస్సల సమయం మార్చాలని కృష్ణ మండలంలో ప్రజన్నుహబ్బాకోరుతున్నారు వీళ్ళ సమయం కాలేజీ ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమవుతుంది కానీ బస్సు 10: 30 నిమిషాలకు ముడుమల్ గ్రామం చేరుకుంటుంది,ఆ టైం వీళ్లకు అనుకూలంగా లేదు, దీనివలన వీళ్లు రోజు ముడుమల్ గ్రామం నుండి 8 కిలోమీటర్లు కాలినడకన గుడెబల్లూర్ చేరుకొని అక్కడి నుండి బస్సులకు వెళ్తారు,అంతలోపే వాళ్ళ కాలేజీ ప్రారంభమై, క్లాసులు వినలేక విద్యాభ్యాసం సరిగ్గా కొనసాగించలేక విద్యార్థులు సత మతమతున్నారు, అధికారులను ఎన్నిసార్లు మొరపెట్టుకున్న బస్సులను సమయానికి వచ్చే విధంగా మార్చాలని అధికారులను కోరిన ,వినతి పత్రాలు సమర్పించిన పట్టించుకోవడం లేదు, మండలంలోని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. ముడుమల్ గ్రామానికి ఉదయం 7:30 నిమిషాలకు ముడుమాల్ నుండి మక్తల్ కు, సాయంత్రం మక్తల్ నుండి ముడుమాల్ కు 4:30 నిమిషాలకు బస్సులను సరియైన నడిపించి విద్యార్థుల విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు,ప్రజల రవాణా సౌకర్యాలు కలిపించాలని అధికారులను కోరుతున్నారు.లేని పక్షంలో నారాయణ పేట జిల్లా రహదారిపై బైఠాయించి రాకా పోకలు స్తంభింప చేస్తామని మండలంలోని ప్రజలు, విద్యార్థులు హెచ్చరిస్తున్నారు.దీనిపై అధికారుల చర్యలు ఎలా ఉంటాయో వేచి చూడాలి మరి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తు కోసం బస్సులను వేయాల్సిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వెట్టిచాకిరీపై అవగాహన సదస్సు

-ప్రచారానికి.. 'స్వేచ్ఛా రథం'ను జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్,
-స్వేచ్ఛ రథం తో విస్తృత ప్రచారం
-వెట్టిచాకిరీ నిర్మూలన, అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యం,
-జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి.



హన్మకొండ జిల్లా బ్యూరోఛిఫ్26 అక్టోబర్ (విజన్ ఆంధ్ర)వెట్టిచాకిరీపై అవగాహన కల్పించడం, బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 080-69434343ను ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా స్వేచ్ఛ రథం వాహనాన్ని సోమవారం కలెక్టరెట్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రచార వాహనం హనుమకొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ, వెట్టిచాకిరీ, కార్మికుల హక్కులు, దోపిడీకి గురైన సందర్భాల్లో ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న విధానాలపై ప్రజలకు, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పించునుంది ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ... వెట్టిచాకిరీ నిర్మూలనకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని, వెట్టిచాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, అవసరమైన సహాయాన్ని అందించడం కోసం సంబంధిత శాఖలు కృషి చేయాలని పేర్కొన్నారు.వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు వెట్టిచాకిరీ చోటుచేసుకునే అవకాశం ఉన్న ఇతర పని ప్రదేశాల్లోని అసంఘటిత, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మిక రంగాలపై ఈ ప్రచారం ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని.... ఇందులో భాగంగా ఐఈసి (సమాచారం, విద్య, కమ్యూనికేషన్) సామగ్రిని ప్రజలకు అందించడంతో పాటు, ప్రజలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు కార్మికులకు తమ హక్కులపై అవగాహన లేకపోవడం, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థల గురించి తెలియకపోవడం లేదా ప్రతీకార చర్యలకు భయపడటం వల్ల వెట్టిచాకిరీ అనేక సందర్భాల్లో వెలుగులోకి రాకుండా ఉండవచ్చుని... అడ్వాన్స్‌లు, అప్పులు, బలవంతం, బెదిరింపులు, మోసం లేదా పని నుంచి బయటకు వెళ్లే స్వేచ్ఛను పరిమితం చేయడం వంటి మార్గాల ద్వారా కార్మికులు వెట్టిచాకిరీలో చిక్కుకునే అవకాశం ఉందని'స్వేచ్ఛా రథం' ద్వారా వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి, ప్రభుత్వ అధికారులు ఎలా స్పందించగలరు అనే విషయాలపై క్షేత్ర స్థాయి లో తెలియజేయాలన్నారు ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఎన్ జి ఓ కి సంబందించిన బృందం వెట్టిచాకిరి నిర్ములన పైన ప్రదర్శించిన నాటకం అందరిని ఆకట్టుకుంది అనంతరంప్రభుత్వ అధికారులు తమ విధి నిర్వహణలో భాగంగా వెట్టిచాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించి, వారిని రక్షించి, పునరావాసం కల్పించడం ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసారు ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రవి , అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, భార్గవ్ కార్మిక శాఖ, పోలీసు శాఖ/ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ జిల్లా న్యాయ సేవల సంస్థ మహిళా, శిశు అభివృద్ధి శాఖ తదితర సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ద్వారకా నగర్ కాలనీ ఫేస్-1 నూతన అధ్యక్షుడిగా బుడిగ బాలరాజ్ గౌడ్

### కాలనీని ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తాం

బోడుప్పల్,అక్టోబర్ 26(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల డివిజన్ పరిధిలోని ద్వారకా నగర్ కాలనీ ఫేస్-1 నూతన కమిటి ఎన్నిక నిర్వహించారు.నూతన అధ్యక్షుడుగా బుడిగ బాలరాజ్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ గా సమాధుల చిన్న కాశయ్య యాదవ్, ఉపాధ్యక్షులుగా పస్తం శెట్టి సందీప్, ప్రధాన కార్యదర్శిగా మడిగ కిషోర్, కోశాధికారిగా పొడిశెట్టి శ్యాం కుమార్,కార్యదర్శులుగా నారి శివ, తట్టారి శ్రీనివాస్,కమిటీ సభ్యులుగా పొత్తగానీ మధు గౌడ్,మధును ఆంటోనీ,మేకల క్రాంతి కుమార్, చాగంటి శ్రీనివాస్,పొన్నగంటి భాస్కర్, భయ్యా యాదగిరి యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బుడిగ బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ కాలనీ అధ్యక్షులుగా తమను గెలిపించిన కాలనీవాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నూతన కమిటీ సభ్యులందరూ సమిష్టిగా ద్వారకా నగర్ కాలనీ ఫేస్-1 ను ఆదర్శంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ, ప్రజలకు కనీస వసతులు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని పేర్కొన్నారు. కాలనీలోని అన్ని విభాగాల అభివృద్ధికి కృషి చేస్తామని, కాలనీవాసుల ఐక్యతతో సమస్యలను పరిష్కరించేందుకు సమష్టిగా పనిచేస్తామని వెల్లడించారు

## వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి26 అక్టోబర (విజన్ ఆంధ్ర)సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొని వారికి పూల మాల వేసి ఘన నివాళులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఇతి హాసాల్లోమొట్టమొదటిఆదికావ్యంరామాయణంరచించారు. అలాంటి రామాయణాన్ని రచించింది ఒక బోయ కులానికి చెందిన చోరుడు, ప్రతి ఒక్కరు రామాయణాన్ని నిత్యం వారిని పారాయణం చెయ్యాలి. ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమయంలో జ్ఞానోదయం అవుతుంది. వాల్మీకి జీవితం ఏ పని చేసిన ధర్మబద్ధంగా మంచి మార్గంలో వెళ్ళాలని, ప్రతి ఒక్కరు ఇది పాటించి వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈయన ఇచ్చిన స్ఫూర్తితో అనేక మంది రచయితలుగా, కవులుగా మారారు ముఖ్యంగా పెద్దబాలశిక్ష అనే పుస్తకంలో అన్ని అంశాలతో కూడినవి నేర్చుకోవడం జరుగుతుంది. ఇలాంటి గొప్ప వారి చరిత్రల గురించి తెలుసుకోవడం నేటి తరానికి చాలా అవసరమని తెలిపారు.
ఇట్టి కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఎస్డిసి సుదర్శన్, జడ్పిసిఈఓ రమేష్, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి సయ్యద్ రఫీ, ఏ ఓ రాజ్ కుమార్, బీసీ సంఘాల నాయకులు తదిరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలి

ఏఐసీసీ పరిశీలకుడు మోహన్ కుమార మంగళం
ఓటర్ల జాబితాలపై కాంగ్రెస్ సమరభేరి
ఓటు హక్కు పరిరక్షణకు 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ఉద్యమం
ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్
మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం




మేడ్చల్ జిల్లా/బోడుప్పల్, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఓటర్ల జాబితాల రూపకల్పనలో పారదర్శకత పాటించి, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని ఏఐసీసీ పరిశీలకుడు మోహన్ కుమార మంగళం డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీఎంజీ బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పీసీసీ ఉపాధ్యక్షుడు యూసఫ్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార మంగళం మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాల నుంచి అర్హులైన వారి పేర్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపించకుండా చూడాలని, ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హుడికి ఓటు వేసే అవకాశం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణకు ఉద్యమం'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతోందని నేతలు తెలిపారు. బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాలను పరిశీలించి, అర్హుల పేర్లు తొలగించినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలకు బాధ్యత వహించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లాలోనూ ఓటర్ల జాబితాలను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోలన్ హనుమంత్ రెడ్డి,రాష్ట్ర నాయకులు రాపోలు రాములు,సీనియర్ నాయకులు,భూపతిరెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బండారు రవీందర్,బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మా గ్రామాల రోడ్లకు మరమ్మతులు చేపట్టండి మహాప్రభు..!

ప్రజావాణిలో ఎంపీడీవో కి వినతి - గ్రామాల ప్రజలు



అయిజ అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని గ్రామాలు కుట్కనూరు, సింధనూరు, టీటీ దొడ్డి,ముగోనిపల్లి, భూమిపురం, ఉత్తనూరు, అయిజ చౌరస్తా వరకు రహదారి పూర్తిగా అధ్వానంగా ఉండటంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల ప్రజలు అయిజ మండల కేంద్రంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో కి వినతిపత్రం సమర్పిస్తూ, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రయాణ కష్టాలను తొలగించాలని విన్నవించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని, రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీజోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులుసింధనూర్ గంగాధర్,ఉప్పరి రామాంజనేయులు శివకుమార్ పాటిల్, నరసింహ, మధు ప్రకాష్, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతం, జిల్లా అభివృద్ధికి నిధుల కేటాయింపుపై నామినేటెడ్ పదవుల గురించి టీపీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు ను కలిసిన డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) ప్రజాభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి లను కలిసిన ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్, మాజీ ఎంపీ శ్రీ సోయం బాబూరావు , మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి , బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ ఆడే గజేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య , ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఈరోజు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి తో సమీక్ష సమావేశం లో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఇరువురు ప్రముఖులను శాలువాలతో సత్కరించారు . ఈ భేటీలో ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ శ్రేణులను సమన్వయంతో ముందుకు నడిపించడం, రాబోయే రోజుల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం వంటి పలు కీలక అంశాలపై నాయకులు చర్చించారు. అదేవిధంగా త్వరలో ప్రకటించనున్న నామినేటెడ్ పదవుల నియామకాల విషయంలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న అర్హులైన నాయకులు, కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యత కల్పించడం గురించి చర్చించడం జరిగింది తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను కూడా నాయకులు ప్రస్తావించారు. జిల్లాలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించడం, స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతం తదితర అంశాలపై చర్చిస్తూ, జిల్లాకు అవసరమైన నిధులు మంజూరు చేయడానికి తగిన సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ, "ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడం మా ప్రధాన లక్ష్యం. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించేలా పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తున్నాం. రాబోయే నామినేటెడ్ పదవుల నియామకాలలో అర్హులైన వారికి అవకాశాలు కల్పించే అంశంపై చర్చించాం" అని పేర్కొన్నారు. అలాగే, ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సంబంధించి మాట్లాడుతూ, "జిల్లాలోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలకు మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. రహదారులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమం తదితర రంగాల్లో జిల్లా అభివృద్ధి చెందేలా ప్రభుత్వ పెద్దల సహకారంతో ముందుకు సాగుతాం. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ద్వారా జిల్లాకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడమే మా లక్ష్యం" అని డా. నరేష్ జాదవ్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్టం చేస్తామని, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయానికి బంగారు కౌస్తుభం బిళ్ళ బహుకరణ




వాళ్ళ దగ్గర అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంకు గద్వాల బాణాల శేషు ఫణి పుష్పావతమ్మల పెద్ద కోడలు బాణాల దీపిక పెద్ద కుమారుడు బాణాల విజయ సారథి శ్రీ తిమ్మప్ప స్వామికి మధ్యలో తామరపై కూర్చున్న లక్ష్మీదేవి, రెండు వైపులా ఏనుగులతో అభిషేకం చేస్తున్న రూపం గల 10 గ్రాముల బంగారు కౌస్తుభం బిళ్ళ ను దేవాలయానికి అందజేశారు. సోమవారం శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు, అర్చకులకు అందజేశారు. శ్రీ స్వామివారికి ప్రతిరోజు అలంకరణలో ఉండాలని ఆలయ అధికారులకు చైర్మన్ సూచించారు. వారికి వారి కుటుంబ సభ్యులకు శ్రీహరి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## మహర్షి వాల్మీకి బోధనలు సమాజానికి మార్గదర్శకం

### జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 26, (విజన్ ఆంధ్ర) :రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి పాల్గొని మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం ధర్మం, నీతి, సత్యం, ఆదర్శ జీవన విలువలను సమాజానికి బోధిస్తుందని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జీవితం, ఆయన రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహర్షి వాల్మీకి బోధించిన విలువలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కేశురామ్, అధికారులు, సిబ్బంది, వాల్మీకి సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేటను కరువు జిల్లాగా ప్రకటించాలి

ఎకరాకు రూ. 25 వేల పరిహారం ఇవ్వాలి
రైతు రుణాలు రీషెడ్యూల్ చేయాలి
తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్



నారాయణపేట, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు సమీపంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘంబండ ప్రాజెక్టు ఉన్న మక్తల్ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించినప్పుడు, నారాయణపేట నియోజకవర్గాన్ని ఎందుకు కరువు ప్రాంతంగా ప్రకటించడం లేదని ప్రశ్నించారు. రెండేళ్లు గడుస్తున్నా ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి జిల్లా సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. కరువు పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరాకు రూ. 25 వేల చొప్పున రైతులకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. పంటల చివరి దశలోనైనా బోర్ల ద్వారా పంటలను కాపాడుకునేందుకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. రైతులు తీసుకున్న రుణాలను రీషెడ్యూల్ చేయడంతోపాటు ప్రత్యేకంగా కరువు రైతుబంధు ప్రకటించి ఆదుకోవాలని అన్నారు. పంటలు లేక ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రేషన్ దుకాణాల ద్వారా కారం పొడి, పప్పు, ఉప్పు, చింతపండు వంటి నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని కోరారు. రానున్న ఎనిమిది నెలలపాటు రైతులకు, ప్రజలకు ప్రభుత్వం అండగా నిలవాలని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి సమస్యలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని గవినోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే పది లక్షల ఎకరాలకు నీళు వస్తాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఆశించిన ప్రయోజనం దక్కలేదని విమర్శించారు. పాలమూరు ప్రాంతం నుంచి ఎంపీగా గెలిచిన తర్వాత కూడా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కేసీఆర్ తమను మోసం చేశారనే భావనతో కవితక్క ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం, సామాజిక న్యాయం అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు కార్పొరేట్ పాఠశాలల్లోనూ ఉచిత విద్య అందించే బాధ్యత తీసుకుంటామని, యువతకు ఉపాధి కల్పించడంతోపాటు చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామని కవితక్క ప్రకటించినట్లు వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని, అధికారులతో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి కరువు పరిస్థితులపై వాస్తవ వివరాలు సేకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే కార్యాలయాలు, మంత్రి నివాసాల ముట్టడికి తెలంగాణ రక్షణ సేన వెనుకాడదని హెచ్చరించారు. మహాధర్నా అనంతరం నాయకులు, కార్యకర్తలు జిల్లా కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరి వెళ్లి కలెక్టర్ కార్యాలయ ఏఓ అనిల్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తప్పకుండా తీసుకెళ్తానని ఏఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మక్తల్ ఇంచార్జి సి హెచ్ వెంకటన్న కొడంగల్ ఇంచార్జి రాజా ప్రభాకర్, దామర్ గిద్ద అధ్యక్షులు నర్సింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, మహిళా అధ్యక్షులు సంధ్యారాణి కొత్తపల్లి అధ్యక్షులు శివశంకర్, జిల్లా యువత అధ్యక్షులు మనోజ్ గౌడ్. నారాయణ రెడ్డి, తనిష్క వివిధ మండల నాయకులు పార్టీ కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు, పోలీసులకు వ్యాసరచన పోటీలు

కృష్ణ అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని కృష్ణ ఎస్ఐ ఎస్.ఎం. నవీద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'సైబర్ నేరాల నివారణలో పోలీసులు, పౌరుల పాత్ర', 'మాదకద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్ర', 'విద్యార్థులు డ్రగ్స్‌కు ఎలా దూరంగా ఉండాలి?' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా పోలీస్ సిబ్బందికి సమాజం పట్ల పోలీసుల బాధ్యతలు, సోషల్ మీడియా వినియోగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్.ఎం. నవీద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తూ చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం, ఓటీపీ వంటి కీలక సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఏదైనా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తును లక్ష్యంగా చేసుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని ఎస్ఐ ఎస్.ఎం. నవీద్ తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరసత్వం, పోలీసుల పట్ల అవగాహన, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- ఇందిరమ్మ ఇళ్ల మార్కౌట్, విజిబి-- జీ రామ్ జీ పనులను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్






కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 26(విజన్ఆంధ్ర)కామారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 79 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. వై. గిరి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్, జిల్లా రెవెన్యూ అధికారి పాండు తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మార్కౌట్, విజిబి--జీ రామ్ జీ పనులను త్వరగా పూర్తి చేయాలిప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ అన్ని మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మార్కౌట్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే విజిబి--జీ రామ్ జీ పథకం కింద చేపట్టిన పనులను ప్రతి చోటా 20 నుంచి 30 మంది కూలీలతో నిర్వహించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## సింగూరు జలాశయం నుంచి రోజు విడిచి రోజు బల్క్ నీటి సరఫరా

- నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి: మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ ఎస్. స్వప్న



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 26(విజన్ఆంధ్ర)ఎల్‌నినో ప్రభావంతో సింగూరు జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్న నేపథ్యంలో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బల్క్ నీటి సరఫరాను రోజు విడిచి రోజు అందించాలని నిర్ణయించినట్లు బాన్సువాడ మిషన్ భగీరథ గ్రిడ్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్. స్వప్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు, 29న బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాలకు బల్క్ నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. అలాగే, అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కోరారు. నీటి కొరతను అధిగమించేందుకు ప్రజలందరూ సహకరించాలని ఈఈ ఎస్. స్వప్న విజ్ఞప్తి చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

### ప్రజావాణిలో 106 వినతుల స్వీకరణ

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26(విజన్ ఆంధ్ర)ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూధన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, ప్రతి ఫిర్యాదును పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజావాణి దరఖాస్తులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, వాటిలోని అంశాలను పూర్తిగా అర్థం చేసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారుప్రజావాణిలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాలు, భూ సర్వే-- రికార్డులు, గృహ నిర్మాణం, రవాణా, పోలీసు, గిరిజన అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్య ఆరోగ్యం, గనులు, అటవీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 106 వినతులను అధికారులు స్వీకరించారు. బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను వెంటనే సమర్పించాలిప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, అన్ని శాఖల్లో ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను ర వెంటనే సమర్పించాలని ఆదేశించారుఅలాగే కారుణ్య నియామకాల కు సంబంధింప్రతి శాఖలో మంజూరైన పోస్టులు, ఖాళీగా ఉన్న పోస్టులు, వాటికి సంబంధించిన రోస్టర్ వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారుఅన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాల్లోని సిబ్బంది వివరాలు, ఖాళీల స్థితిగతులు, రోస్టర్ పాయింట్లను సరిచూసుకుని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నివేదికలు పంపాలని స్పష్టం చేశారు. రోస్టర్ నిర్వహణలో గతంలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని సూచించారుఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జెడ్ . పి.సి.ఈ.ఓ, ఇన్‌చార్జి డి.పి.ఓ వెంకట్‌రెడ్డి, డి . ఆర్.డి.ఓ నర్సింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను పర్యటించాలి

## ఎల్.నినో పరిస్థితులపై సమీక్షించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26(విజన్ ఆంధ్ర)మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించాలని,ఆయా గ్రామాల్లో ఎల్.నినో పరిస్థితులపై సమీక్షించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో మండల ప్రత్యేక అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటనలపై సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారులు బుధవారం మండలం లోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేయడంతోపాటు, తమ శాఖలకు సంబంధించిన కార్యక్రమాల అమలు తీరును పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అధికారి వారంలో కనీసం రెండు నుంచి మూడు గ్రామపంచాయతీలను సందర్శించాలని, ప్రతి నెలా తమకు కేటాయించిన మండలాల్లోని గ్రామాలను క్రమం తప్పకుండా పర్యటించాలని సూచించారు. కేవలం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీని సందర్శించి సరిపెట్టుకోకుండా, మారుమూల గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎల్ నీ నో పరిస్థితుల వల్ల గ్రామాలలో త్రాగు నీటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రత్యేక అధికారులు వాటి పై దృష్టి సారించి నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికఎల్.నీ.నో వల్ల జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున రానున్న వేసవిలో తాగునీటి కొరత ఏర్పడకుండా ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లోని బోరుబావులు, చేతిపంపులు, నీటి సరఫరా వ్యవస్థలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్లు, కుళాయిల పనితీరును పరిశీలించాలన్నారు. ఎక్కడైనా నీటి లీకేజీలు, వృథా జరుగుతున్నట్లయితే వెంటనే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో రానున్న ఐదు నుంచి ఆరు నెలల పాటు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఎలాంటి ప్రణాళిక ఉందో పరిశీలించాలన్నారు. అవసరమైనప్పుడు నీటి ట్యాంకర్లను సిద్ధం చేసుకోవడం, వాటిని ఎక్కడి నుంచి నింపాలి, ఏయే గ్రామాలకు సరఫరా చేయాలి, నీటిని ఎక్కడ నిల్వ చేయాలి అనే అంశాలపై ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. నీటి సంరక్షణలో భాగంగా ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణం వంటి పనుల పురోగతిని కూడా తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాల్లో నీరు, విద్యుత్ వృథాను అరికట్టాలిప్రభుత్వ కార్యాలయాల్లో అవసరం లేనప్పుడు విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, ఏసీలను నిలిపివేయాలని కలెక్టర్ సూచించారు. నీరు, విద్యుత్ వృథాను అరికట్టడం ప్రతి అధికారి బాధ్యతగా భావించాలన్నారు. ఇదే విధానాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహాల్లో నీటి వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, బోరుబావుల నుంచి అవసరానికి మించి నీటిని వినియోగించకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్, నీటి వృథా నివారణకు అధికారులు స్వయంగా చర్యలు తీసుకోవడంతోపాటు, తమ పరిధిలోని సిబ్బందికి కూడా స్పష్టమైన సూచనలు ఇవ్వాలన్నారు. పాఠశాలలు, ఆసుపత్రుల్లో సేవల నాణ్యతను పరిశీలించాలిక్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించాలని కలెక్టర్ తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారా, ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అనే అంశాలను పరిశీలించాలన్నారుమధ్యాహ్న భోజన పథకం అమలులో ఆహార నాణ్యత, పరిశుభ్రతను తనిఖీ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా, పరిశుభ్రత పాటిస్తున్నారా అనే విషయాలను పరిశీలించి, లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారుఅధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు తమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలతోపాటు గ్రామంలోని ఇతర ప్రభుత్వ సేవల పనితీరును కూడా పరిశీలించాలని తెలిపారు. గ్రామస్థుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారుఅధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని, తమ అనుభవాన్ని ఉపయోగించి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలపై ఇకపై జరిగే సమీక్షల్లో వివరాలను పరిశీలిస్తామని, ఆదేశాలను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారుఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ డి. ఆర్.ఓ ఎ.నిర్మల, జెడ్.పి.సి.ఈ.ఓ, ఇన్చార్జి డి. పి.ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'స్వేచ్ఛా రథం'ను జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

## స్వేచ్ఛ రథం తో విస్తృత ప్రచారం
## వెట్టిచాకిరీ నిర్మూలన, అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యం
## జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



వెట్టిచాకిరీపై అవగాహన కల్పించడం, బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 080-69434343ను ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా స్వేచ్ఛ రథం వాహనాన్ని సోమవారం కలెక్టరెట్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రచార వాహనం హనుమకొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ, వెట్టిచాకిరీ, కార్మికుల హక్కులు, దోపిడీకి గురైన సందర్భాల్లో ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న విధానాలపై ప్రజలకు, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పించునుంది ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ... వెట్టిచాకిరీ నిర్మూలనకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని, వెట్టిచాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, అవసరమైన సహాయాన్ని అందించడం కోసం సంబంధిత శాఖలు కృషి చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు వెట్టిచాకిరీ చోటుచేసుకునే అవకాశం ఉన్న ఇతర పని ప్రదేశాల్లోని అసంఘటిత, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మిక రంగాలపై ఈ ప్రచారం ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని.... ఇందులో భాగంగా ఐఇసి (సమాచారం, విద్య, కమ్యూనికేషన్) సామగ్రిని ప్రజలకు అందించడంతో పాటు, ప్రజలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు కార్మికులకు తమ హక్కులపై అవగాహన లేకపోవడం, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థల గురించి తెలియకపోవడం లేదా ప్రతీకార చర్యలకు భయపడటం వల్ల వెట్టిచాకిరీ అనేక సందర్భాల్లో వెలుగులోకి రాకుండా ఉండవచ్చని... అడ్వాన్స్‌లు, అప్పులు, బలవంతం, బెదిరింపులు, మోసం లేదా పని నుంచి బయటకు వెళ్లే స్వేచ్ఛను పరిమితం చేయడం వంటి మార్గాల ద్వారా కార్మికులు వెట్టిచాకిరీలో చిక్కుకునే అవకాశం ఉందని'స్వేచ్ఛా రథం' ద్వారా వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి, ప్రభుత్వ అధికారులు ఎలా స్పందించగలరు అనే విషయాలపై క్షేత్ర స్థాయి లో తెలియజేయాలన్నారు ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఎన్జీవో కి సంబందించిన బృందం వెట్టిచాకిరి నిర్ములన పైన ప్రదర్శించిన నాటకం అందరిని ఆకట్టుకుంది అనంతరంప్రభుత్వ అధికారులు తమ విధి నిర్వహణలో భాగంగా వెట్టిచాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించి, వారిని రక్షించి, పునరావాసం కల్పించడం ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసారు ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రవి , అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, భార్గవ్ కార్మిక శాఖ, పోలీసు శాఖ/ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏ హెచ్ టి యు), జిల్లా న్యాయ సేవల సంస్థ (డి ఎల్ ఎస్ ఏ), మహిళా, శిశు అభివృద్ధి శాఖ తదితర సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
## హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్
## జిల్లా కలెక్టరేట్ తో పాటు ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం



హన్మకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని త్వరగా పరిష్కరించాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో ఉండకుండా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 303 అర్జీలు అందాయి. ఇందులో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో 150 అర్జీలు అందగా, ఆర్డీవో కార్యాలయాల్లో 16, ఎంపీడీవో కార్యాలయాల్లో 137 అర్జీలను అధికారులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూలి ప్రతి శాఖలోని ఉద్యోగులకు మీప్రమాణం (మీ ప్రయాణం) యాప్ ద్వారా ముఖ గుర్తింపు ఆధారిత హాజరు వ్యవస్థను అమలు చేయాలన్నారు. ఈ వ్యవస్థలో ఉద్యోగులు కార్యాలయ పరిధిలో మొబైల్ ద్వారా రోజువారీ హాజరు నమోదు చేయాలన్నారు. జిల్లాకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన ప్రతి ఉద్యోగి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని పలు గ్రామాలలో భూముల రీ సర్వే జరుగుతుందని, సాగునీటి పారుదల, పంచాయతీరాజ్, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూముల రికార్డులు, వివరాలతో సంబంధిత శాఖల అధికారులు రీసర్వే ద్వారా ధ్రువీకరణ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర)పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, జిల్లాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు, దరఖాస్తుల పరిశీలన, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం తో పాటు ఓటర్ల నమోదు చివరి తేదీ 6.11.2026 ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ, నమోదుపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారుఫారం తెలుగులో మరియు ఇంగ్లీష్ లో ప్రింట్ మీడియా లో పబ్లిష్ చేయమన్నారు. ఓటరు నమోదు కోసం అందిన దరఖాస్తులను నిర్దేశిత నిబంధనల ప్రకారం పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో విద్యార్హత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అవసరమైన సందర్భాల్లో అసలు ధ్రువపత్రాలను పరిశీలించి నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి నవీన్, ఎన్నికల విభాగం డీటీ జఫర్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

## ఓటరు దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి
## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




నారాయణపేట, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) ఎస్ఐఆర్--2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటరు దరఖాస్తుల పరిష్కారం, సంబంధిత రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్--2026 ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసుల ప్రక్రియను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను తగిన ఆధారాలతో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా పేర్కొంటూ తప్పనిసరిగా స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలని ఆదేశించారు. ఫారం--6, ఫారం--7, ఫారం--8 దరఖాస్తులను నవంబర్ 5వ తేదీలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బూత్‌స్థాయి అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ కార్యాలయాల్లో ఎస్ఐఆర్--2026కు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహిస్తూ భద్రపరచాలని సూచించారు. శాసనమండలి నియోజకవర్గ ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఫారం--18 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన నివేదికను పత్రికలు, ప్రసార మాధ్యమాలకు అందించడంతో పాటు సహాయ ఎన్నికల నమోదు అధికారులు, నియమిత అధికారుల కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తూ, ఓటర్ల జాబితాల నిర్వహణలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 11 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ ను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మార్పు సాధ్యమేనని చాటిన మహర్షి వాల్మీకి జీవితం.. ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

## రైతులకు అండగా రోటరీ క్లబ్ బాలికలకు ఉచిత సైకిళ్ల పంపిణీకి నిర్ణయం

మహబూబాబాద్, సేవా కార్యక్రమాలతో సమాజాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా మహబూబాబాద్ రోటరీ క్లబ్ ముందడుగు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత ఆరోగ్య శిబిరాల నిర్వహణతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలని క్లబ్ సమావేశంలో నిర్ణయించారు. ఇదే సమావేశంలో రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికరాలను రూపొందిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కంబాలపల్లి గ్రామానికి చెందిన షణ్ముఖాచారిని ఘనంగా సన్మానించారు. రోటరీ క్లబ్ సమావేశంలో ఈ ఏడాది చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసేందుకు ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించారు.

## చెడును విడిచి సన్మార్గంలో నడిస్తే జీవితానికి సార్థకత..!

### జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

### --జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

గద్వాల అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర బ్యూరో)చెడు మార్గం నుంచి సన్మార్గం వైపు పయనించి, తన జీవితాన్నే ఆదర్శంగా మలుచుకుని, ప్రపంచానికి అపురూపమైన రామాయణ మహాకావ్యాన్ని అందించిన ఆదికవి మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. సోమవారం ఆదికవి మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మహర్షి జీవిత విశేషాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలు, బోధనలు నేటి సమాజానికి అందించే సందేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ఒక సామాన్య వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి, వేటగాడిగా జీవనం సాగించిన వాల్మీకి మహర్షి, సప్తర్షుల బోధనలతో ఆత్మపరివర్తన చెంది మహర్షిగా అవతరించడం గొప్ప విషయమన్నారు. తనలోని ప్రతికూల ఆలోచనలను విడనాడి, జ్ఞానమార్గంలో పయనిస్తూ, మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, ఆదర్శ జీవన విలువలను బోధించే రామాయణ మహాకావ్యాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి అని కొనియాడారు. కృషి, పట్టుదల, సంకల్పబలం ఉంటే సాధారణ వ్యక్తి సైతం అసాధారణ విజయాలను సాధించగలడనే విషయానికి వాల్మీకి మహర్షి జీవితం నిలువెత్తు నిదర్శనమని ఎస్పీ పేర్కొన్నారు. మనిషి గతం ఎలా ఉన్నప్పటికీ, తన ఆలోచనల్లో మార్పు తెచ్చుకుని, మంచి మార్గాన్ని ఎంచుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన జీవితం చాటిచెబుతోందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా దృఢ సంకల్పంతో ముందుకు సాగితే లక్ష్యాలను సాధించవచ్చని, ప్రతి ఒక్కరూ మహర్షి వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహర్షి వాల్మీకి బోధించిన విలువలను ఆచరణలో పెట్టడం ద్వారా వ్యక్తిగత జీవితంలోనే కాకుండా సమాజంలోనూ సానుకూల మార్పును తీసుకురావచ్చని ఎస్పీ అన్నారు. యువత ముఖ్యంగా ఆయన జీవితంలోని ఆత్మపరివర్తన, పట్టుదల, జ్ఞానసాధన వంటి అంశాల నుంచి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. శంకర్, ఆర్ఐ నరేష్, ఆర్ఎస్ఐలు, సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 26, (విజన్ ఆంధ్ర): సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతి, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పెండింగ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర ఎన్నికల అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని, అనర్హులుగా గుర్తించిన సందర్భాల్లో అందుకు గల కారణాలను సంబంధిత ఆధారాలతో సహా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టిపట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సీఈఓ సూచించారు. ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీ అని తెలిపారు. ఫారం-18 ద్వారా అందిన దరఖాస్తులను సంబంధిత అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో క్షుణ్ణంగా పరిశీలించి, నకిలీ, తప్పుడు, డూప్లికేట్ దరఖాస్తులను గుర్తించాలని ఆదేశించారు. అనధికార వ్యక్తుల ద్వారా ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అర్హులైన పట్టభద్రులకు విస్తృతంగా అవగాహన కల్పించి, గడువులోగా దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, ఆమోదించిన మరియు తిరస్కరించిన దరఖాస్తుల వివరాలను సంబంధిత కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఎన్నికల సంబంధిత దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన కారణాలతో కూడిన స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేస్తామని పేర్కొన్నారు. అనవసర జాప్యాన్ని నివారిస్తూ, పెండింగ్ అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపడతామని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## "సత్యనిష్ఠతో సమృద్ధి" అవినీతి రహిత సమాజమే లక్ష్యం!

### వరంగల్ - సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్



హన్మకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) భారతదేశ తొలి ఉపప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి నవంబర్-1వ తేదీని పురస్కరించుకుని జాతీయ ఐక్యత, సమగ్రత, దేశ సమైక్యత ప్రాధాన్యతను చాటిచెప్పేలా "సత్యనిష్ఠతో సమృద్ధి" అనే ఇతివృత్తం: తో అక్టోబర్ 26 నుండి నవంబర్ 1 వరకు నిర్వహిస్తున్న జాగరూకత అవగాహన వారోత్సవాల్లో భాగంగా, సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. జాతీయ ఐక్యతను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు డీసీపీలు వి.శ్రీనివాస్, సురేష్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మదుసుధన్, హన్మకొండ ఏసీపీ నరసింహారావు, సిసిఎస్ ఏసీపీ సదయ్య, ఎఆర్ ఏసీపీలు సుదీంద్ర, నాగయ్య, అంతయ్య, ఆర్ఐలు స్పర్జన్ రాజ్, సతీష్, శ్రీదర్, చంద్రశేఖర్ తో పాటు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలలో పాల్గొన్నఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర బ్యూరో)గద్వాల నియోజకవర్గంలో పలు గ్రామాలలో శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వాల్మీకి విగ్రహాలకి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. పలు గ్రామాలలోని వాల్మీకి సంఘం నాయకులు, సర్పంచులు ఎమ్మెల్ల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ముందుగా గద్వాల నియోజకవర్గం ప్రజలందరికీ,వాల్మీకి సోదరులకు వాల్మీకి మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆదికవి వాల్మీకి మహర్షి రామాయణం రచించారు మనం ఏదో సందర్భంలో రామాయణం గురించి ఆ సీతారాముల గురించి ప్రపంచానికి తెలియజేశారు గ్రామాలలో వాల్మీకి విగ్రహం చేయడం గ్రామంలో ఒక పండగ వాతావరణం నెలకొంటుందని, ప్రతి ఒక్కరూ భక్తి భావంతో దేవుని అనుగ్రహం ఉన్నప్పుడే మనం ఏ పని చేసినా ఆ పనిలో విజయం కలుగుతుంది తెలిపారు. ప్రతి గ్రామాలలో రైతులు, ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వాల్మీకి మహర్షి ఆశీస్సులతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గంలోని



పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాల్మీకి సోదరులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొని వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఘన నివాళులు



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో మహర్షి వాల్మీకి చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన రామాయణం సమాజానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవీయ విలువలను బోధిస్తుందని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు డీసీపీలు వి.శ్రీనివాస్, సురేష్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మదుసుధన్, హన్మకొండ ఏసీపీ నరసింహారావు, సిసిఎస్ ఏసీపీ సదయ్య, ఎఆర్ ఏసీపీలు సుదీంద్ర, నాగయ్య, అంతయ్య, ఆర్ఐలు స్పర్జన్ రాజ్, సతీష్, శ్రీదర్, చంద్రశేఖర్ తో పాటు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి ఆర్జీలను నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల అక్టోబర్ 26 విజన్( ఆంధ్ర బ్యూరో)ప్రజావాణి ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా నిబంధనల మేరకు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్ తో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ వారం ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం మొత్తం 27 ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందన్నారు. జిల్లాస్థాయి ప్రజావాణికి వచ్చిన ఆర్జీల్లో ప్రస్తుతం 94 అపరిష్కృతంగా ఉన్నాయని, సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మండల స్థాయి ప్రజావాణికి కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని సైతం సకాలంలో పరిష్కరించాల్సి ఉందన్నారు. సంబంధిత అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి సకాలంలో హాజరుకావాలని, తమ శాఖల పరిధిలో వచ్చిన ఫిర్యాదులను ఆన్ లైన్ లో నమోదు చేయడమే కాక పరిష్కారమైన వాటి వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవల్లిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

### ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్

ఎర్రవల్లి అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) మహబూబ్‌నగర్--హైదరాబాద్--రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ మాట్లాడుతూ,అలంపూర్ నియోజకవర్గంలోని పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా గ్రామస్థాయి నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చొరవ తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, వారి ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు



మహబూబ్‌నగర్--హైదరాబాద్--రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయం

## పాఠశాలలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ అవగాహన కార్యక్రమం

### --హాజరైన న్యాయమూర్తులు




గద్వాల అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 26.10.2026న గద్వాల్‌లోని కాకతీయ హైస్కూల్‌లో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాలల లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం, 2012 (ఫోక్సో యాక్ట్, 2012)పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దుర్వా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ, వ్యక్తిగత భద్రత, సురక్షితమైన, అసురక్షితమైన స్పర్శల మధ్య తేడా, ఆపద సమయంలో ధైర్యంగా స్పందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా అనుచిత సంఘటన ఎదురైనప్పుడు మౌనంగా ఉండకుండా విశ్వసనీయమైన పెద్దలకు తెలియజేయాలని, అవసరమైనప్పుడు సంబంధిత అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీయూ సభ్యుడు సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీమా జేమ్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గద్వాల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బుర్దపేటలో అవగాహన కార్యక్రమంఅదేవిధంగా, గద్వాల్‌లోని బుర్దపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా 26.10.2026న సురక్షిత్ బచ్పన్ అభియాన్ -- బోలో, బతావో, బచావో (మాట్లాడండి, తెలియజేయండి, రక్షించండి) అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడిందిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,జి. నిష్కా పాత్రుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి సురక్షితమైన బాల్యం కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులను నివారించడంలో అవగాహన ఎంతో ముఖ్యమని, పిల్లలు తమకు ఎదురయ్యే ఇబ్బందులను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా విశ్వసనీయమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు. బాలల హక్కులు, వారి రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు, ముఖ్యంగా పోక్సో చట్టం, 2012 గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్




హనుమకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) కార్మికులకు వ్యతిరేకంగా, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, అక్టోబర్ 31 తేదీన జరిగే ఏఐటీయూసి 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసి జిల్లా ఆఫీస్ బేరర్ ల సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్ అధ్యక్షతన జరుగగా ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడులను మార్చి కార్మికులకు ఉరితాల్లుగా మారే 4 లేబర్ కోడులను తెచ్చి కార్మిక సంఘాలను విచ్చినం చేయడానికి పూనుకుందని అన్నారు. బిజెపి మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కార్మికులను శ్రమదోపిడికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేసి కార్మికులకు నష్టం చేకూర్చే 4 లేబర్ కోడులను రద్దు చేసే వరకు కార్మికులందరూ పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 31 తేదీన జరిగే ఏఐటీయూసి 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్మికులందరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రాంమూర్తి, ఉపాధ్యక్షులు బత్తిని సదానందం, ఎన్ ఎ స్టాలిన్, లంకదాసరి అశోక్, ఆలకుంట యాకయ్య, సహాయ కార్యదర్శులు మాలోత్ శంకర్, గుంటీ రాజేందర్, ఆలకుంట మల్లయ్య, కుడిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 327 యూనియన్ 73వ వ్యవస్థాపక దినోత్సవం కాగజ్‌నగర్‌లో జెండా ఆవిష్కరణ: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



కాగజ్‌నగర్, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర): తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్--327 ఆధ్వర్యంలో 73వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం కాగజ్‌నగర్‌లోని స్థానిక విద్యుత్ విభాగం కార్యాలయం ఎదుట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జెండాను ఆవిష్కరించి, వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మాజి సతీష్ మాట్లాడుతూ, యూనియన్ ఏర్పడినప్పటి నుంచి గత 73 ఏళ్లుగా కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. జి. సంజీవరెడ్డి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతుండటం యూనియన్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యూనియన్ ముందుకు సాగుతోందని తెలిపారు. కార్మికులకు త్వరలో పీఆర్సీ అందేలా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగులు, కార్మికులు, కళాకారులు, శ్రామికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రతి ఒక్కరికీ పెన్షన్ సౌకర్యాలు కల్పించే దిశగా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం యూనియన్ నాయకులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, కంపెనీ ఉపాధ్యక్షుడు మేకల రామకృష్ణ, డివిజన్ కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి ప్రదీప్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదారి, నాయకులు శ్రీరాములు, సుధారాణి, నర్సింగరావు, మల్లేష్, భారతి, మోహన్, లత, శకుంతల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పనిచేస్తున్న 14 మందిని రెగ్యులరైజేషన్ చేస్తూ నియామక పత్రాలను అందజేశారు.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 26, (విజన్ ఆంధ్ర) : రంగారెడ్డి జిల్లాలో వివిధ మండలాలు, జిల్లా ప్రజా

పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, ఒక ఆఫీస్ సబార్డినే కు టైపిస్టుగా రెగ్యులరైజేషన్ చేస్తూ రెగ్యులర్ చేస్తూ పదోన్నతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి చేతుల మీదుగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నాడు అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా

పరిషత్ ముఖ్య కార్యనిర్వాణాధికారి సిహెచ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. పదోన్నతి పత్రాలను అందుకున్న ప్రతి ఒక్కరూ సంతోషంతో కలెక్టర్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు

# రవీంద్ర భారతిలో ఘనంగా కళాకార్ ఐకాన్ అవార్డ్స్

*వివిధ రంగాలకు చెందిన కళాకారులకు పురస్కారాలు*




హైదరాబాద్ అక్టోబర్ 26 విజన్ ఆంధ్ర : కళాకార్ తెలుగు టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా పురస్కారాలు కళాకార్ ఐకాన్ అవార్డ్స్ కార్యక్రమం. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై ఘనంగా జరిగింది. టీవీ, సినిమా, యూట్యూబ్, ఓటీటీ, ఇన్‌స్టాగ్రామ్ తదితర రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న సుమారు 200 మంది కళాకారులకు ఈ సందర్భంగా అవార్డులు ప్రదానం చేశారు, మేకప్ ఆర్టిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, గీత రచయితలు, గాయకులు, దర్శకులు, కెమెరామెన్లు, నటీనటులు, నాట్య గురువులు, నాట్య కళాకారులను పురస్కారాలతో సత్కరించారు, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిస్ ఆసియా ఇంటర్నేషనల్, మిస్ ఇండియా ప్లానెట్, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ జాతీయ చేనేత బ్రాండ్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్, గౌరవ అతిథిగా నటి, నిర్మాత, టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డా.రోజా ఖుషి హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా మేము సైతం యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు చకిలం స్వప్న శ్రీనివాస్‌తో పాటు నటీమణులు చరిష్మా నాయుడు, సోనీ, వడ్డి మహేశ్వరి, సింగంశెట్టి సింధు, నవీన కొంజర్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, కళాకారుల ప్రతిభను గుర్తించి రవీంద్ర భారతి వంటి ప్రతిష్ఠాత్మక వేదికపై సత్కరించడం అభినందనీయమన్నారు, కళాకార్ తెలుగు టీవీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డా. సిరాజ్ గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంస నీయమని, ఇటీవల మలేషియాలో అంతర్జాతీయ అవార్డుల వేడుకను విజయవంతంగా నిర్వహించడాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ ప్రయాణంలో తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు, డా.సిరాజ్ మాట్లాడుతూ. కార్యక్రమానికి హాజరైన అతిథులకు, అవార్డు గ్రహీతలకు, చిన్నారుల తల్లిదండ్రులకు, పత్రికా, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

**- అదనపు కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించిన బిఆర్ఎస్**



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 26 విజన్ ఆంధ్ర బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆనాటి కలెక్టర్ లాటరీ పద్ధతి ద్వారా 330 మంది డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగింది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లబ్ధిదారులకు ఇల్లను కేటాయించకుండా కాలయాపన చేస్తుందని, గతంలో మేము డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించాలని ఇచ్చిన అప్లికేషన్ కు ఎలాంటి స్పందన రాలేదని కావున ఇప్పటికైనా వెంటనే 330 మంది డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను కేటాయించాలనని అదేవిధంగా ఇటీవలే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం తీసిన లాటరీలో పూర్తిగా అవినీతి జరిగిందని ఇళ్ల కోసం దాదాపు 17 వేలు అప్లికేషన్లు వస్తే అందులో కేవలం 807 మందిని ఎలా గుర్తించారు చెప్పాలని మరియు 807 లబ్ధిదారుల లిస్టును బహిర్గతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అబ్దుల్ సత్తార్,పెట్టం స్వరూప-లక్ష్మణ్,గుమ్మడి శ్రీనివాస్ మరియు మాజీ కౌన్సిలర్లు పోరెడ్డి రాజు,వంగ తిరుపతి,తోట తిరుపతి మరియు నాయకులు పడాల రవీందర్,బల్లికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ఘనంగా వాల్మీకి జయంతి

**- పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు**



నిర్మల్ జిల్లా,అక్టోబర్ 26,(విజన్ ఆంధ్ర);జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఒక బోయవాడు గొప్ప కవిగా ఎలా మారాడో వాల్మీకి జీవితమే ఉదాహరణ అని చెప్పారు. ఆయన వల్లనే రామతత్వం అందరికీ బోధపడిందని, ఆయన రచించిన ఏడు కాండాల రామాయణం అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఆయన జీవితాన్ని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, బిసి అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, డిఈవో భోజన్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎల్డిఎం రామ్ గోపాల్, సహాయ బిసి అభివృద్ధి అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా వాల్మీకి సంఘ ప్రతినిధులు ఆకుల సుదర్శన్, వేల్పుల మల్లేష్, ఎండపల్లి అశోక్, ఆకుల రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,అక్టోబర్ 26,(విజన్ ఆంధ్ర); భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం బాసర మండలంలోని మధాపూర్ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి గ్రామంలో చేపట్టిన రీసర్వే గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది తప్పనిసరి క్షేత్రస్థాయి సర్వే సమయంలో అందుబాటులో ఉండాలన్నారు. సర్వే నిర్వహణకు సంబంధించిన రైతులకు సమాచారం ముందుగానే అందించాలన్నారు. సంబంధిత కమతాల రైతులంతా సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలని వివరించారు. సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. ఈ పరిశీలనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపిడివో దేవేందర్ రెడ్డి, రెవెన్యూ, సర్వే అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు 28న ధ్రువపత్రాల పరిశీలన, వ్రాత పరీక్ష

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 26 విజన్ ఆంధ్ర : జిల్లా పరిధిలో జాతీయ ఆయుష్ మిషన్ క్రింద ఆయుష్ పబ్లిక్ హెల్త్ కార్యక్రమాల నిర్వహణకు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన తో పాటు వ్రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, అనంతరం ఉదయం 11 గంటలకు వ్రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నిర్ణీత తేదీ, సమయానికి అవసరమైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

# పెద్దపల్లిలో విద్యా విప్లవం...!!

**- రూ.70 కోట్లతో మౌలిక వసతుల కల్పన**

**- టాస్క్ ద్వారా 2,600 మందికి కొలువులు**

**- నైపుణ్యంతోనే యువతకు బంగారు భవిష్యత్తు**

**- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర): యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.27 లక్షలతో ఆధునీకరించిన అదనపు తరగతి గదులు, రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన టాస్క్ ప్రాంతీయ కేంద్రంతో పాటు, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో రూ.2.50 లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

*వారం రోజుల్లో 'టాస్క్' పురోగతిపై శ్వేతపత్రం*

గ్రామీణ, పట్టణ ప్రాంత యువతలో నైపుణ్యాలను వెలికితీసి కార్పొరేట్ కొలువులు సాధించేలా పెద్దపల్లిలో టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. గత ఏడాదిన్నర కాలంలోనే టాస్క్ ద్వారా 2,600 మంది యువత ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవడం గర్వకారణమన్నారు. ఈ కేంద్రం ద్వారా సాధించిన విజయాలు, కల్పించిన ఉద్యోగాలపై వారం రోజుల్లో సమగ్ర శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రకటించారు.

*విద్యా రంగానికి రూ.70 కోట్లు ఫలితాల్లో జిల్లా నంబర్ 1...!*

పెద్దపల్లి నియోజకవర్గంలో పాఠశాలల పునరుద్ధరణ, అదనపు గదుల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు రూ.70 కోట్లు వెచ్చిస్తున్నామని, ఒక్క పెద్దపల్లి మండలంలోనే రూ.14 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరగడం వల్లే ఈ ఏడాది ఒక్క పెద్దపల్లి మండలంలోనే ప్రైవేట్ పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని తెలిపారు. గతంలో పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో 32వ స్థానంలో ఉన్న పెద్దపల్లి జిల్లా.. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ, పర్యవేక్షణతో నేడు రాష్ట్రంలోనే ప్రథమ స్థానానికి చేరుకుందని కొనియాడారు. పేద విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.800 కోట్లతో హరే రామ ట్రస్ట్ సహకారంతో పౌష్టికాహార అల్పాహార పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.



*క్రమశిక్షణ లేకుంటే పరీక్షలకు అనుమతించొద్దు..!*

ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితంలో కీలకమైన దశ అని, ఈ వయసులో ఆకర్షణలకు లోనుకాకుండా లక్ష్యంపైనే దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే హితవు పలికారు. అధ్యాపకులు విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షిస్తూ సరైన దిశానిర్దేశం చేయాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల హాజరును కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు పాటించని వారిని పరీక్షలకు అనుమతించవద్దని స్పష్టం చేశారు. ఈ విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తావులేదని తేల్చిచెప్పారు.

*వైద్యరంగంలోనూ గణనీయమైన మార్పు..!*

విద్యతో పాటు ప్రజా వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, గత మూడేళ్లలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సేవల్లో విప్లవాత్మక మార్పులు వచ్చి ఏకంగా నాలుగు అవార్డులు దక్కించుకుందని గుర్తుచేశారు. జూనియర్ కళాశాల, ఆసుపత్రి షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా వచ్చే అద్దె ఆదాయాన్ని నేరుగా ఆయా సంస్థల అభివృద్ధి, నిర్వహణకే ఖర్చు చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయరమణ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంద్రానగర్ దాహార్తికి శాశ్వత పరిష్కారం!!

**- రూ.1.90 కోట్లతో భారీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ**

**- 1,200 కుటుంబాలకు తీరనున్న తాగునీటి కష్టాలు**

**- రామగుండం ముఖచిత్రం మారుస్తాం**

**- ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ధీమా**





పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర): రామగుండం నియోజకవర్గంలో ఏ ఒక్క ఇల్లూ మంచినీటి కోసం అల్లాడకూడదన్నదే తమ ధ్యేయమని స్థానిక శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. నగరంలోని 8వ కాలనీ (19వ డివిజన్) ఇంద్రానగర్ ప్రజల చిరకాల స్వప్నమైన తాగునీటి సరఫరా వ్యవస్థకు నేడు గట్టి పునాది పడింది. సుమారు రూ.1.90 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 6 లక్షల లీటర్ల సామర్థ్యం గల అత్యాధునిక ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు, నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఘనంగా భూమిపూజ నిర్వహించారు.

*ప్రాజెక్ట్ ప్రత్యేకతలు..!*

భారీ నిల్వ సామర్థ్యం: ఏకకాలంలో 6 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే వ్యవస్థ.

ప్రత్యక్ష లబ్ధి: ఇంద్రానగర్ పరిధిలోని సుమారు 1,200 గృహాలకు ఇంటింటికీ పైపులైన్ల ద్వారా స్వచ్ఛమైన జలం. ఎద్దడికి ముగింపు: ఏటా వేసవి రాగానే ఎదురయ్యే తీవ్ర నీటి ఎద్దడికి ఈ ప్రాజెక్ట్‌తో శాశ్వత పరిష్కారం లభించనుంది.

*అభివృద్ధి సంకల్పం.. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాటల్లో..!*

గత పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్లనే నియోజకవర్గంలో తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఆ అసమర్థ పాలన మిగిల్చిన సమస్యలను పరిష్కరిస్తూ నగరాన్ని వేగంగా ప్రగతి పథంలోకి నడిపిస్తున్నాం.

సమగ్ర మౌలిక వసతులు: కేవలం మాటలకే పరిమితం కాకుండా, ప్రతి కాలనీలో నాణ్యమైన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ (యూజీడీ), ప్రధాన కూడళ్లలో సెంట్రల్ లైటింగ్‌లతో రామగుండం ముఖచిత్రాన్ని ఆధునికీకరిస్తున్నాం."

సంయుక్త భాగస్వామ్యం: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, సింగరేణి సంస్థల సంయుక్త సహకారంతో నిధుల కొరత లేకుండా నగర సమగ్ర రూపురేఖలను తీర్చిదిద్దుతున్నాం. ఈ మహా యజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి అని అన్నారు.

*ఉత్సాహంగా తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, శ్రేణులు..!*

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు ఎండీ ముస్తఫా, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మారెల్లి రాజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు దిటి బాలరాజు, లింగస్వామిలతో పాటు కార్పొరేటర్లు శంకర్ నాయక్, అనుము స్వరూప రాములు, దేవనపల్లి చక్రపాణి, త్రిపరపు శ్రీనివాస్, నీలకంటి రాము, దూళికట్ట సతీష్, సాంబమూర్తి పాల్గొన్నారు. వారితో పాటు కాంగ్రెస్ పట్టణ కమిటీ, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా విభాగాల ప్రతినిధులు, కాలనీ పెద్దలు మరియు స్థానిక మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రాజెక్ట్ ప్రారంభం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## రోడ మేస్త్రి నగర్‌లో కాంగ్రెస్‌లోకి పలువురి చేరికలు!

**- కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు**

**- నూతనంగా చేరిన వారికి కాంగ్రెస్ కండువాలతో సాదర స్వాగతం**

**- మొహమ్మద్ అజమ్ ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమం**




కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్రా): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 279వ డివిజన్ రోడ మేస్త్రి నగర్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు మొహమ్మద్ అజమ్ ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఆయన వారికి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఫైమిదే బేగం, కౌటీ, అఫ్రీన్ బేగం, యస్మీన్ బేగం, ఫాతిమా బేగం, రుబీనా బేగం, రుఖ్యా బేగం, సాజీదే బేగం, కాయుణ్ణిసా, ఫోజియా బేగం, షేక్ షానవాజ్, షేక్ యూసఫ్, సైడ్ మాసురన్, షేక్ ఫిరోజ్, మొహమ్మద్ అజమ్, మొహమ్మద్ తౌఫిక్, మొహమ్మద్ సాబేర్, మొహమ్మద్ అబ్దుల్ రెహమాన్, మొహమ్మద్ జునైద్, మొహమ్మద్ మజహర్, సైడ్ బహుద్దీన్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గణేష్, డివిజన్ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మహిళా కోఆర్డినేటర్ కార్యదర్శి ఫారీన్ ఖాన్, డీసీసీ మైనారిటీ విభాగం జనరల్ సెక్రటరీ షఫీ, అజార్, షరీఫ్, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు, గురువు పసుమర్తి రామలింగ శాస్త్రి శిష్యురాలు కుమారి 'నవ్య మల్లెంపాటి' అద్భుత కూచిపూడి నాట్య ప్రదర్శన ఆదివారం సాయంత్రం రవీంద్రభారతి ప్రధాన మందిరం, సైఫాబాద్ హైదరాబాద్ లో నేత్రపర్వంగా జరిగింది. నట్టు వాంగానికి, పక్క వాయిద్యాలకి అనణుగుణంగా కుమారి నవ్య వివిధ నృత్యంశాలను విశేషంగా నయనానందకరంగా ప్రదర్శించి అందరి దృష్టిని ఆకర్షించింది, చప్పట్ల వర్షం కురిపించింది.(ఆకెళ్ళ విశ్వనాథ్)

# మంచిర్యాల లో రూ.100 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా పట్టించుకోరా?

**- సర్వే నంబర్ 87లో అక్రమ ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకోవాలి:**

**- అదనపు కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ఎంఐఎం**



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 26 విజన్ ఆంధ్ర మంచిర్యాల పట్టణ నడిబొడ్డున ఉన్న సర్వే నంబర్ 87లోని సుమారు ఒక ఎకరం భూమి విషయంలో నెలకొన్న వివాదంపై ఎంఐఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.100 కోట్లు ఉంటుందని పేర్కొంటూ, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి ఎంఐఎం మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ షాకీర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇబ్ని అఫాన్ వినతిపత్రం సమర్పించారు.ఈ భూమికి సంబంధించి హైకోర్టులో ౘా.ౘా. చీశీ. 234 శీట 2023 కేసు పెండింగ్‌లో ఉందని ఎంఐఎం నాయకులు తెలిపారు. తమకు అందిన సమాచారం ప్రకారం, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో ప్రతివాది నంబర్ 1 ఎలాంటి థర్డ్ పార్టీ హక్కులను సృష్టించరాదని, వివాదాస్పద భూమి భౌతిక స్వరూపాన్ని మార్చరాదని ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూమిపై ప్రహరీ గోడ నిర్మాణానికి జరుగుతున్న ప్రయత్నాలపై విచారణ జరిపి, కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పేదలకు ఒక న్యాయం.. కోట్లు విలువ చేసే భూమి విషయంలో మరో న్యాయమా అని ప్రశ్నించారు 2026 జూన్ 24న ఇదే ప్రాంతంలో జీవనోపాధి కోసం చిన్నచిన్న దుకాణాలు నిర్వహించుకుంటున్న చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించారని ఎంఐఎం నాయకులు గుర్తుచేశారు. దాదాపు 30 ఏళ్లుగా ఆ దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల ఉపాధి దెబ్బతిందని తెలిపారు. సుమారు 200 మంది పోలీసుల సమక్షంలో దుకాణాల తొలగింపు జరిగిందని పేర్కొంటూ, పేద చిరు వ్యాపారులపై చర్యలు తీసుకున్న అధికారులు, కోట్ల రూపాయల విలువైన వివాదాస్పద భూమి విషయంలోనూ చట్టప్రకారం వ్యవహరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు స్పందించాలని సర్వే నంబర్ 87 భూమి వ్యవహారంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తమ వైఖరిని స్పష్టం చేయాలని ఎంఐఎం నాయకులు కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ అధికార యంత్రాంగం బాధ్యత అని, ఈ విషయంలో ఎలాంటి పక్షపాతం లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివాదాస్పద భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించి, ప్రహరీ గోడ నిర్మాణ ప్రయత్నాలపై సమగ్ర విచారణ జరపాలని, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను అమలు చేస్తూ భూమికి రక్షణ కల్పించాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. పేదల దుకాణాల తొలగింపులో చూపిన చట్టబద్ధమైన నిబద్ధతను ప్రభుత్వ భూముల పరిరక్షణలోనూ చూపాలి. ప్రభుత్వ భూములను కాపాడటం ప్రజాప్రయోజనానికి సంబంధించిన విషయం. సర్వే నంబర్ 87 భూమి విషయంలో అధికారులు తక్షణమే స్పందించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి అని ఎంఐఎం నాయకులు డిమాండ్ చేశారు.

# బాసర ఐఐఐటిలో నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు

**- రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు భౌతిక తరగతులు ప్రారంభిస్తాం - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా,అక్టోబర్ 26,(విజన్ ఆంధ్ర); బాసర ఐఐఐటి (ఆర్జియుకేటీ)లో విద్యార్థులకు నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర ఐఐఐటి ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఐఐఐటి లో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిపి పదివేల మంది వరకు ఉంటారని, వారికి తాగునీరు, రోజువారి అవసరాల నిమిత్తం ప్రతి రోజూ దాదాపు15 లక్షల లీటర్ల వరకు నీరు కావాలని అన్నారు. గోదావరి నది వద్ద ప్రత్యేకంగా ఐఐఐటి కోసం 60 హెచ్ పి సామర్థ్యం గల మూడు మోటార్లు అందుబాటులో ఉండగా, వాటిలో ప్రస్తుతం ఒకటి పూర్తిస్థాయిలో పని చేయగా, రెండు పనిచేయడం లేదని అన్నారు. ఈ విషయం తమ దృష్టికి రాగానే రెండు మోటార్ల మరమ్మత్తుల కొరకు 8 లక్షల రూపాయలను కేటాయించినట్లు వివరించారు. ఇప్పటికే సంబంధిత సాంకేతిక నిపుణుల బృందం ఇంటెక్ వెల్ ను సందర్శించిందని తెలిపారు. పది రోజుల్లోనే రెండు మోటార్లను బాగు చేసి నీటి సరఫరాకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఒక మోటారు దాదాపు రోజుకు 25 లక్షల లీటర్లను సరఫరా చేయగలదని వివరించారు. ఈ నీరు ఐఐఐటి రోజువారీ అవసరాలకు సరిపోతుందని చెప్పారు. పెరుగుతున్న నీటి అవసరాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మరొక నూతన మోటార్ ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఐఐఐటి అవసరాలకు ఇంకనూ నీరు అవసరమైతే రోజుకు 10 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయగలిగే సామర్థ్యం ఉన్న గ్రామపంచాయతీ ఇంటెక్ వెల్ నుంచి 1.3 నుంచి 1.5 ఎంఎల్ డి నీటిని అందిస్తామని అన్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఐఐఐటి ప్రాంగణంలో 29 ఎకరాల విస్తీర్ణంలో నీటి నిల్వ కుంట అందుబాటులో ఉందని, దాని ద్వారా కూడా ఐఐఐటి అవసరాలకు ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుతం ఆ కుంటను శుభ్రం చేసి మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం నీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు లేవని, విద్యార్థులకు రెండు, మూడు రోజుల్లోనే భౌతిక తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంటనే భౌతిక తరగతులు ప్రారంభించేలా సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు రోజువారి నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. నీరు తగినంత లభ్యంగా ఉందని, నీటి సరఫరా లోనే కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు గోదావరి నది వద్ద గల ఐఐఐటికి నీటిని సరఫరా చేసే ఇంటెక్ వెల్ ను పరిశీలించారు. నీటి సరఫరా కు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండు మోటార్లకు అవసరమైన పరికరాలను తెప్పించి, వీలైనంత త్వరగా మరమ్మతులను పూర్తిచేయాలని అన్నారు. ఆ తర్వాత ఐఐఐటి ప్రాంగణంలోని నీటి కుంటను, పంపు హౌస్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, గ్రిడ్ డిఈఈ, ఈఈ లు రాజేశ్వర్ రావు రాఘవేంద్ర రెడ్డి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపిడివో దేవేందర్ రెడ్డి, ఐఐఐటి డీన్ లు మహేష్, విఠల్, విద్యార్థి సంక్షేమ అధికారి నాగరాజు, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూర్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

- గోదావరి పుష్కరాల పనులు, పర్యాటక అభివృద్ధి, గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సమస్యల తక్షణ పరిష్కారం
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 26 విజన్ ఆంధ్ర చెన్నూర్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని c రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. భాస్కర్, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూరు పట్టణానికి నూతన రూపు తీసుకురావాలనే ఉద్దేశంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వ్యాపారుల సహకారంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరిగిందని, బైపాస్ రోడ్డును రికార్డు సమయం పూర్తి చేసామని తెలిపారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన వ్యాపారులకు అండగా హామీ మేరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రస్తుతం 20 షాపుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని, అర్హులైన వ్యాపారులకు మరో 50 షాపుల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజారోగ్య- మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 5 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో పట్టణంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ జంక్షన్ నుండి పెద్ద చెరువు (రావి చెట్టు) వరకు బి.టి. రోడ్డు విస్తరణ, రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం, సెంట్రల్ మీడియన్ నిర్మాణం, లైటింగ్ ఏర్పాటు, మహంకాళి ఆలయం నుండి జాతీయ రహదారి 63 (గోదావరి రోడ్డు) వరకు 3 కోట్ల 50 లక్షల రూపాయలతో సి.సి. రోడ్డు విస్తరణ, జాతీయ రహదారి 63 నుండి గోదావరి పుష్కర ఘాట్ వరకు 6 కోట్ల రూపాయల వ్యయంతో రోడ్డు విస్తరణ, సెంట్రల్ మీడియన్, లైటింగ్ ఏర్పాటు, పుష్కర ఘాట్ సమీపంలో 50 లక్షల రూపాయల వ్యయంతో క్రైమాస్ లైటింగ్ ఏర్పాటు కొరకు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో చెన్నూర్ పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు 70 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, పుష్కరాల ఘాట్లకు వెళ్లే రహదారిపై ఇప్పటికే కొంతమేర సి.సి. రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భక్తులకు రాకపోకలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ రహదారుల నిర్మాణంలో టెండర్ల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో పనులను త్వరగా ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాలలోని అంతర్గత రహదారులతో పాటు శ్మశానవాటికలకు వెళ్లే మార్గాలను అభివృద్ధి చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కోటపల్లి ప్రాంతంలో ఎస్.సి. వసతి గృహానికి అవసరమైన నిధుల కేటాయింపు, సంబంధిత అభివృద్ధి చర్యలపై దృష్టి సాధించడం జరిగిందని తెలిపారు. పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా జైపూర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని మొసళ్ళ పార్క్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని తెలిపారు. మందమర్రి ప్రాంతంలోని గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల సౌకర్యం కల్పించేందుకు తగిన ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇండ్ల నిర్మాణ పనులలో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సుద్దాల గ్రామంలో ఇసుక సరఫరాకు సంబంధించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వార్డులలో ఇళ్ల నిర్మాణ పురోగతిని ప్రజా ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాలు ప్రారంభించని / నెమ్మదిగా కొనసాగుతున్న ఇండ్లను గుర్తించి లబ్ధిదారులకు సహకరించాలని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పనుల అమలులో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి పాత బస్టాండ్ రూపురేఖలు మారుస్తాం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- మురికి కాలువ స్థానంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు
- ఆవరణలో నూతన వ్యాపార సముదాయాల నిర్మాణం
- డీఎం రికార్డులు తెప్పించాలని ఆదేశం






వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) : వనపర్తి పట్టణంలోని చారిత్రాత్మక పాత బస్టాండ్‌ను పూర్తిగా పునరుద్ధరించి, ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు స్థానిక శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. పాత బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో నిత్యం ఇబ్బందికరంగా మారిన మురికి కాలువను ఆధునిక అండర్ డ్రైనేజీ వ్యవస్థగా మారుస్తామని హామీనిచ్చారు. అలాగే, బస్టాండ్ ఆవరణలో సరికొత్త వ్యాపార సముదాయాలను (కమర్షియల్ కాంప్లెక్సులు) ఏర్పాటు చేయిస్తామని వెల్లడించారు. బస్టాండ్ స్థలానికి సంబంధించిన సమగ్ర రికార్డులను వెంటనే తీసుకురావాల్సిందిగా వనపర్తి డిఎంను ఎమ్మెల్యే ఆదేశించారు. పాత బస్టాండ్‌ను అన్ని హంగులతో సుందరీకరించి, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి ఎస్.ఎల్.ఎన్. రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తిరుపతయ్య, జర్నల్ సెక్రటరీ బ్రహ్మంచారి, పరశురాం, కౌన్సిలర్లు వెంకటేష్, చుక్కరాజు, బి. కృష్ణ, పాల రవి, యాదగిరి, మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, వనపర్తి డిఎం దేవేందర్ గౌడ్, కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మాసము పౌర్ణమి రోజున శ్రీ వెంకటేశ్వర స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ సేవ కమిటి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం..!





కాప్రా/ అక్టోబర్ -26(విజన్ ఆంధ్ర ) : మేడ్చల్ జిల్లా నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్.బి . కాలనీ 19 డివిజన్ మంగాపురం కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆర్చ్ వద్ద పౌర్ణమి, వాల్మీకి జయంతి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ సేవ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ సేవా కమిటి సభ్యులు సమ్మని మురళీ చారి మాట్లాడుతూ పౌర్ణమి సందర్భంగా వెంకటేశ్వర స్వామి వారికి ఎంతో ప్రీతికరమైన తిథి అని తిరుమలలో కూడా పౌర్ణమి రోజున స్వామివారిని గరుడ వాహనం పైన ఊరేగింపు చేస్తారని తెలియజేశారు. ప్రతి నెల పౌర్ణమి రోజున శ్రీ వెంకటేశ్వర స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సహాయ సహకారాలతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సోమవారం పౌర్ణమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తన్నీరు బ్రహ్మయ్య, సమ్మని మురళీ చారి, విక్రమ్ ఠాగూర్, సాయినాథ్,ఎస్. సత్యనారాయణ చారి, రామకృష్ణ, పి.మల్లేష్ గౌడ్, పవన్ కుమార్, సురేష్, శివ కుమార్ వర్మ, ప్రభాకర్ చారి, వరదరాజు,మణికంఠ వాలంటరీగా ముందుకు వచ్చి పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసారు.

## పెండింగ్ ఎస్ఐఆర్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- పారదర్శకంగా, తప్పులకు తావులేకుండా ఓటరు జాబితా సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, డెస్క్ విజన్ ఆంధ్ర, అక్టోబర్ 26: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, అర్హత కలిగిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్ పనులపై సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు టి.ఎల్. సంగీత, ఆర్. పాండు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హతలను నిర్ధారించాలన్నారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల విషయంలో అనర్హతకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయడంతో పాటు, అందుకు సంబంధించిన ఆధారాలు, పూర్తి వివరాలను రికార్డుల్లో భద్రపరచాలని సూచించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల వివరాలను మరోసారి క్షుణ్ణంగా పునఃపరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు.

## కలెక్టరేట్లో నీటిని, విద్యుత్ ను ఆదా చేయాలి

- ఎల్ నినో సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కలెక్టర్ కీలక సూచనలు
-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, అక్టోబర్ 26:విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి ) : కలెక్టరేట్లో నీటిని, విద్యుత్ ను ఉద్యోగులందరూ ఆదా చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్లోని ఈసమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ఎల్ నీ నో ప్రభావం వల్ల రానున్న రోజుల్లో త్రాగునీటికి, విద్యుత్ కి చాలా సమస్య వచ్చే ప్రమాదం ఉన్నందున అధికారులు, సిబ్బంది జిల్లా కార్యాలయాల్లో ఫ్యాన్లు, లైట్లు నిరంతరం వెలగకుండా చూసుకోవాలని, అవసరం ఉన్నంత మేరకే నీటిని వినియోగించాలని , నీటి సంరక్షణ చేసి,విద్యుత్ ను పొదుపు చేసినప్పుడే భవిష్యత్ తరాలకు అందించవచ్చు అని తెలిపారు. మీ ప్రమాణం యాప్ లో తప్పక హాజరు నమోదు చేసుకోవాలి. కార్యాలయ ఉద్యోగుల కోసం తెచ్చిన నూతన యాప్ లో తప్పనిసరిగా కార్యాలయ ఉద్యోగులు హాజర నమోదు చేసుకోవాలని, హాజరు నమోదును కార్యాలయ జిల్లా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వచ్చే శనివారం లోపు నీప్రమాణం యాప్ లో తప్పనిసరిగా నమోదు కావాలని అధికారుల ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి!

- వెన్నెలగడ్డ చెరువు సుందరీకరణకు 'బ్లూ ఓషన్' ప్రాజెక్టు
- 'అసెజ్ వావో' సంస్థ కృషి అభినందనీయం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. చెరువుల పరిరక్షణతో పాటు వాటికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు 'అసెజ్ వావో' సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. బ్లూ ఓషన్ ప్రాజెక్టులో భాగంగా జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెన్నెలగడ్డ చెరువు సుందరీకరణ పనులను చేపడుతున్న 'అసెజ్ వావో' సంస్థ ప్రతినిధులు సోమవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ద్వారా చెరువుల సుందరీకరణతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీవజాల మనుగడతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెరువుల పరిరక్షణతో పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. చెరువులకు పూర్వవైభవం తీసుకురావడంతో పాటు పర్యావరణ హిత కార్యక్రమాలను చేపడుతున్న సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెస్సీ తెలంగాణ సంస్థ ప్రతినిధులు కృపాకర్, ఆశిష్, మహేంద్ర, శిరీష, రోషిణి తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- సంపన్నబోల్ హరి గౌడ్



కీసర, అక్టోబర్ 26, విజన్ ఆంధ్ర : పట్టభద్రులు ఓటర్లు గానమోదు చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రధాన కార్యదర్శి సంపన్న బోల్ హరి గౌడ్ అన్నారు. యువకులు, మేధావులు, చదువుకున్న వారు ముందుకు వచ్చి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డివిజన్ పరిధిలోని పట్టభద్రుల ఓట్లను ఎన్రోల్ చేయించాలని పార్టీ నాయకులను కోరారు హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున ఓటర్ నమోదు కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. పట్టుబద్రుల నమోదు చివరి తేదీ నవంబర్ 6 కావున డివిజన్ పరిధిలో నాయకులు అందరూ సమయాన్ని కేటాయించి పనిచేయాలని సంపన్న బోల్ హరి గౌడ్ తెలిపారు.

## అమ్మవారిని దర్శించుకున్న సామల శ్రీనివాస్ రెడ్డి



కీసర, అక్టోబర్ 26, విజన్ ఆంధ్ర : రంగారెడ్డి జిల్లా కర్తాల్ లోని మైసిగండి అమ్మవారిని ఆదివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు సుమేష్ మోహన్, జగపతిరావు తో కలిసి సామల శ్రీనివాస్ రెడ్డి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని సామల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ద

## భూ రీ సర్వే పనుల నిర్వహణ కొరకు రోవర్ల కొనుగోలు

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 26 విజన్ ఆంధ్ర : భూ రీ సర్వే పనుల నిర్వహణ కోసం అవసరమైన జిఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో అవసరమైన రోవర్ల కొనుగోలు కొరకు ఈ.ఓ.ఐ. ప్రక్రియ ద్వారా ఆసక్తిగల సంస్థల వివరాలు పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. భూ రీ సర్వే పనులకు అవసరమైన సాంకేతిక ప్రమాణాలు, పరికరాల పనితీరు తదితర అంశాలకు పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భూ రీ సర్వే పనులను మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించేందుకు ఆధునిక సర్వే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో సి ఎం ఆర్ డెలివరీ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైస్ మిల్లులకు సంబంధించిన సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం పంపిణీలో మిగిలి ఉన్న డెలివరీలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయి మొత్తాల రికవరీ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. సిఎంఆర్ లక్ష్యాల సాధనలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలనిబ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంచశీల కాలనీలోని సమస్యలను పరిష్కరించాలి

- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కాలనీ వాసులు



అల్వాల్, అక్టోబర్ 26,(విజన్ ఆంధ్ర): పంచశీల కాలనీలో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు, ప్రజావాణిలో అధికారులను కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ... తమ కాలనీలో అంతర్గత రోడ్లు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధం, వీధి కుక్కల బెడద వంటి సమస్యలు ఉన్నాయని వీటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి, విజయ వర్ధన్ రెడ్డి, ఇంద్రసేనా చారి, మధుసూదన్ రెడ్డి, రామకృష్ణ, విష్ణు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు

## బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ నిర్వహణలో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వాలకు, పౌరులకు సాంకేతిక సేవలు అందిస్తున్న బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ నిర్వహణలో తెలంగాణలోని కొత్తగూడెంలో అత్యాధునిక ఆధార్ సేవా కేంద్రం(ఎ.ఎస్.కె)ను జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ అంకిత్ ఐఎఎస్ ఇతర ప్రముఖులతో కలిసి ప్రారంభించినట్లు బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేంద్రంలో నాలుగు ఆధార్ కిట్ల ద్వారా కొత్త నమోదు, పేరు, చిరునామా, పుట్టిన తేదీ సవరణలు, బయోమెట్రిక్ వివరాల నవీకరణ తదితర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రోజుకు 200 నుంచి 250 మందికి సేవలు అందించే సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో వీల్‌చైర్, దివ్యాంగులకు అనుకూలమైన మరుగుదొడ్లు, నిరీక్షణ ప్రాంతం, టోకెన్ వ్యవస్థ, తాగునీరు, ఏసీ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం, సందేహాల నివృత్తికి కూడా ప్రత్యేక సహాయం అందించనున్నట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



కీసర, అక్టోబర్ 26, విజన్ ఆంధ్ర : గోధుమకుంటకు చెందిన చింతల సన్నీ బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 12,500 చెక్కును కీసర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీర వినోద్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా చింతల ఆంజనేయులుకు అందజేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 26 విజన్ ఆంధ్ర : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తీకి చెందిన మొహమ్మద్ గౌస్ పట్టణంలోని కూరగాయల మార్కెట్, బెల్లంపల్లి బస్తీ ప్రాంతాలలో రహదారి, మురుగు కాలువల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రతినిధులు తమ దరఖాస్తులో నా కాఫ్ ఒప్పందం రద్దు చేయాలని, సంక్షేమ గురుకులాలు, వసతి గృహాలలో సంక్షోభాన్ని పరిష్కరించాలని కోరారు. దండేపల్లి మండలం మోకాసిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్ జి టి బి.దేవకి తనకు ఇన్ సర్వీస్ బి.ఈడి. చేసేందుకు అనుమతించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ముదిగుంట గ్రామంలోని ఎస్.సి. కాలనీవాసులు తమ కాలనీకి సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న మట్టి ఇటుక బట్టి వలన కలుగుతున్న వాయు కాలుష్యం, ప్రజారోగ్యం, పర్యావరణ నష్టాలపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన చెట్టి శ్రీనివాస్ తనకు గురిజాల శివారులో గల భూమిలోకి కొందరు పి ఓ టి చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా ఆక్రమించుకొని పట్టా పొందారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన సల్లూరి దుర్గయ్య గ్రామ శివారులో గల బీడు భూములను వ్యవసాయ భూములుగా చూపించి రైతుబంధు తీసుకుంటున్న విషయంపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 66 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతకుముందు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, బి.సి. సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా యువజన క్రీడల అధికారి హనుమంత రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్సీలాల్, అధికారులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన రామాయణం ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని, వివిధ భాషలలోకి అనువదించబడిన ఈ మహాకావ్యం ఎంతోమందికి సుపరిచితమని తెలిపారు. రామాయణంలోని గొప్ప సందేశాలు, విలువలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆచరించాలని సూచించారు. మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించుకోవడం సంతోషకరమని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహనీయుల గొప్పతనం, వారి జీవిత విశేషాలు భవిష్యత్ తరాలకు తెలుస్తాయని తెలిపారు. మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని వారి ఆదర్శాలను అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, కుల సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# నూతన ఎన్నికైన టిఎన్జీవో మంత్రిని కలిసిన నాయకులు





సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 26 : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారిని సంగారెడ్డి జిల్లా TNGO నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మహమ్మద్ జావిద్ అలీ తన కార్యవర్గ సభ్యులైన అసోసియేట్ అధ్యక్షులు పి.వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, కోశాధికారి కసిని శ్రీకాంత్, మహిళా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి గార్లను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికీ పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత ఉద్యోగులకు ఉందన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. నూతనంగా ఎన్నికైన TNGO కార్యవర్గ సభ్యులు ఉద్యోగులతో సమన్వయం చేసుకుని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు అయ్యేలా కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. ఉద్యోగులు సమన్వయం చేసుకొని సంగారెడ్డి జిల్లాను ప్రగతి పథంలో తీసుకువెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో TNGO పట్టణ శాఖ అధ్యక్షులు యాదవ రెడ్డి, కార్యదర్శి వెంకట్, కార్యవర్గ సభ్యులు వెంకటేశం, నాగేశ్వరరావు, రామప్ప, కిరణ్, గౌస్ హాస్మి, నవాజ్, రమేష్, మోహనప్ప, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు షరీఫ్ ఇంకా తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**- నేరేడ్ మెట్ పోలీసులకు,బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు**



మల్కాజిగిరి, అక్టోబర్ 26, (విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు ప్రచారం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు, ఆదివారం నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... 555 సందీప్ ఆర్ కే ఓ యూత్ ఐకాన్ వాట్సాప్ గ్రూప్ పేరిట, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై ఏఐ ద్వారా రూపొందించిన నకిలీ చిత్రంతో దుష్ప్రచారం చేయడాన్ని ఖండించారు. ఈ గ్రూప్ అడ్మిన్ సందీప్ పేరును ప్రస్తావిస్తూ, మల్కాజిగిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డికి భూ వివాదం, ఎఫ్ఐఆర్‌తో సంబంధం ఉన్న వ్యక్తిగా చిత్రీకరిస్తూ ఏఐ ద్వారా రూపొందించిన చిత్రాన్ని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు సృష్టించి, ప్రజల్లో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో సదరు చిత్రాన్ని, సంబంధిత సందేశాలను వివిధ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేశారన్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ప్రజాదరణను ఎదుర్కోలేక కొందరు వ్యక్తులు ఏఐ ద్వారా తప్పుడు ప్రచారా నికి పాల్పడుతున్నారని, ప్రజలను తప్పుదారి పట్టించే ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ విషయంపై నేరేడ్మెట్ పోలీసులు సమగ్ర విచారణ జరిపి, తప్పుడు కంటెంట్‌ను రూపొందించిన, ప్రచారం చేసిన వ్యక్తులను గుర్తించాలని, సంబంధిత వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ల పాత్రను కూడా పరిశీలించాలని, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.

## 'సీఎంఆర్ఎఫ్' పేదలకు ఓ వరం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, అక్టోబర్ 26,(విజన్ ఆంధ్ర): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు 'సీఎంఆర్ఎఫ్' ఓ వరమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. వినాయక్ నగర్ డివిజన్ కు చెందిన రాజేష్ కు మంజూరైన రూ. 2,00,000/ విలువైన ఎల్ ఓసీ పత్రాన్ని ఆదివారం ఆయన, తన క్యాంపు కార్యాలయంలో బాధితుడి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తాను మల్కాజిగిరి నియోజ కవర్గం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం అందజేసే సీఎం రిలీఫ్ ఫండ్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా సహా యం అందేలా తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు , సురేష్, బాలకృష్ణ, సంపత్ యాదవ్, సాయి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకోవాలి

**- మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి**



అల్వాల్, అక్టోబర్ 26, (విజన్ ఆంధ్ర): అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని అల్వాల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఆదివారం అల్వాల్ డివిజన్ పరిధిలోని జానకినగర్, వేణుగోపాల్ నగర్‌లలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నవంబర్ 6వ తేదీ లోపు గ్రాడ్యుయేట్స్ అందరూ దరఖాస్తు తో పాటుగా అవసరమైన విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను సమర్పించి తమ ఓటు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.ఓటరు నమోదుకు ఫారం -18 సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయ కులు లడ్డూ, నందిని, సందీప్, లోకేష్, మహేం దర్, అభి, అరుణ్, రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు కంటెస్టెడ్ కార్పొరేటర్ సర్వే నరేష్



మల్కాజిగిరి, అక్టోబర్ 26,(విజన్ ఆంధ్ర) : నేరేడ్ మెట్ డివిజన్ సీనియర్ నాయకుడు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్.ఆర్. ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కంటెస్టెడ్ కార్పొరేటర్ సర్వే నరేష్ పలువురు నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి మైనంపల్లి హనుమంత రావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను చూసి మల్కాజిగిరిలో బీఆర్ ఎస్ నాయకులు వరుసగా, తన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటం చాలా సంతోషంగా ఉందన్నారు.

# ఆదికవి వాల్మీకి - రత్నాకరుడి నుండి మహర్షిగా మారిన మహా పరివర్తన!

### *రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా వాల్మీకి జయంతి వేడుకలు!*





తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 26: మహర్షి వాల్మీకి అంటే కేవలం రామాయణ రచయిత మాత్రమే కాదు. ఆయన ఆదికవి. మానవ జీవితంలో పరివర్తన సాధ్యమేననిలి చాటి చెప్పిన మహనీయుడు. పూర్వం ఆయన





రత్నాకరుడుగా దారి దోపిడీలు చేసేవాడు. ఒకరోజు సప్తర్షుల బోధనలతో తన తప్పు తెలుసుకున్నాడు. ఆత్మపరిశీలన చేసుకుని, నిరంతర తపస్సు చేశాడు. ఆ తపస్సు ఫలితంగా మహర్షిగా ఎదిగి, రామాయణ మహాకావ్యాన్ని రచించాడు. ఆయన రచించిన రామాయణం తరతరాలకు ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను బోధిస్తోంది. అందుకే ప్రతి ఏటా వాల్మీకి జయంతిని ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

***రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జయంతి!***

ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకి జయంతి అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. వివిధ జిల్లాల్లో, పట్టణాల్లో, వాల్మీకి ఆలయాల్లో, కమ్యూనిటీ భవనాల్లో, పోలీస్ కార్యాలయాల్లో ప్రత్యేక పూజలు, చిత్రపటాలకు పూలమాలలు, ప్రసంగాలు నిర్వహించారు. నాయకులు, అధికారులు, ప్రజలు వాల్మీకి ఆశయాలను గుర్తు చేసుకుంటూ, ఆయన బోధనలను ఆచరించాలని పిలుపునిచ్చారు.

***మహబూబ్‌నగర్‌లో ఎస్పీ జానకి నివాళి!***

ఈ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాలోనూ ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొని, వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, మంచి ఆలోచన, ఆత్మపరిశీలనతో జీవితంలో గొప్ప మార్పు సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి ఒడిలో జీవనం

**- గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు మరియు మూఢనమ్మకాల చేదు నిజాలు**

**- విజన్ ఆంధ్ర ప్రత్యేక కథనం**











చర్ల,అక్టోబర్ 26 (విజన్ ఆంధ్ర): ఆధునిక ప్రపంచపు రంగుల హంగులకు దూరంగా, ప్రకృతిని నమ్ముకుని, జల-జంగల్-జమీన్ (నీరు, అడవి, భూమి) లనే తమ దైవంగా భావించే అమాయక జీవులు మన గిరిజన సోదరులు, శతాబ్దాలుగా వారు తమదైన ప్రత్యేకమైన సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్నారు, అయితే, ఈ అందమైన సంస్కృతి వెనుక చదువు, అవగాహన లేకపోవడం వల్ల నేటికీ వారిని వేధిస్తున్న మూఢనమ్మకాలు వారి అభివృద్ధికి పెద్ద అవరోధంగా మారాయి, వారి జీవన విధానంలోని వివిధ కోణాలను లోతుగా పరిశీలిద్దాం

***సంపన్నమైన సంస్కృతి - విలక్షణమైన సాంప్రదాయాలు***

గిరిజనుల సంస్కృతి పూర్తిగా ప్రకృతితో ముడిపడి ఉంటుంది, వీరికి చెట్లు, నదులు, కొండలు, జంతువులు కేవలం వనరులు మాత్రమే కాదు, పూజించే ప్రత్యక్ష దైవాలు,మరో విషయం ఏమిటంటే గిరిజన సమాజంలో ఉన్న గొప్పతనం వారి సామూహిక జీవనం, కష్టం వచ్చినా, సుఖం వచ్చినా గ్రామం మొత్తం ఒక్కటిగా నిలుస్తుంది

***పండుగలు - నృత్యాలు***

డోలు వాయిద్యాలతో గుజిల్ల నాదం తో లయబద్ధమైన సంప్రదాయ నృత్యం వారి జీవితంలో ముఖ్య భాగం, సాంప్రదాయ దుస్తులు ధరించి, డప్పులు, కొమ్ము బూరల శబ్దాలకు అనుగుణంగా వారు చేసే సామూహిక నృత్యాలు వారి ఉత్సాహానికి ప్రతీకలు, వెదురుతో చేసే వస్తువులు వారి అద్భుతమైన సృజనాత్మకతకు అద్దం పడతాయి

***సాంప్రదాయ వృత్తులు - జీవనోపాధి***

గిరిజన సమాజం యొక్క జీవనోపాధి పూర్తిగా ప్రకృతి అనుకూలతపైనే ఆధారపడి ఉంటుంది,చాలా తెగలు నేటికీ సాంప్రదాయ పద్ధతిలోనే వ్యవసాయం చేస్తున్నాయి, కొండ వాలు ప్రాంతాల్లో అడవిని నరికి చేసే ఈ వ్యవసాయాన్ని 'పోడు' లేదా 'ఝూమ్' వ్యవసాయం అంటారు, అడవి నుండి విప్పపూవు, తేనె, మూలికలు, జిగురు, కరక్కాయలు, మరియు ఇప్ప రసం వంటి అటవీ ఉత్పత్తులను సేకరించి స్థానిక సంతల్లో (హాట్) అమ్మి జీవనం సాగిస్తారు, మేకలు, గొర్రెల పెంపకం, మట్టి పాత్రల తయారీ, మరియు వెదురుతో బుట్టలు అల్లడం వంటివి వీరికి అదనపు ఆదాయ వనరులు

***మూఢనమ్మకాలు అభివృద్ధికి ప్రధాన అడ్డంకి***

ఒకవైపు వారి సంస్కృతి ఎంతో ఉదాత్తంగా ఉన్నప్పటికీ, మరోవైపు అక్షరాస్యత లేకపోవడం మరియు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తక్కువగా ఉండటం వల్ల వారిలో కొన్ని ప్రాణాంతక మూఢనమ్మకాలు బలంగా నాటుకుపోయాయి చేతబడులు,దయ్యాల పై నమ్మకం ఇప్పటికీ కొన్ని గిరిజన ప్రాంతాల్లో ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోయినా, పంటలు పండకపోయినా దానికి కారణం ఎవరో చేతబడి చేశారని నమ్ముతారు, అమాయక మహిళలను 'చేతబడి నెపంతో వేధించడం, ఊరి నుండి వెలివేయడం వంటి సంఘటనలు సమాజానికి పెద్ద కలంకం

***వైద్యానికి దూరం - వేడి వాతలు పెట్టడం***

ఆధునిక వైద్యంపై అవగాహన లేక, అనారోగ్యం వస్తే ఆసుపత్రికి వెళ్లకుండా 'మంత్రగాళ్ల' (ఓఝా లేదా ఎజ్జోల్లు,) వద్దకు వెళ్తుంటారు, ముఖ్యంగా చిన్న పిల్లలకు జ్వరం లేదా కడుపునొప్పి వస్తే కాల్చిన ఇనుప రాడ్లతో శరీరాలపై వాతలు పెట్టే ఘోరమైన ఆచారం వల్ల ఎంతోమంది పసిప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి జంతు బలుల విషయానికి వస్తే పండుగల సమయంలో లేదా కోరికలు తీరాలని కోరుకుంటూ పెద్ద ఎత్తున జంతు బలులు ఇవ్వడం ఇప్పటికీ విరివిగా సాగుతోంది, పసరు మందు తయారు చేసి వసపరుచుకోవడం వంటివి చేస్తుంటారు

***పరిష్కార మార్గాలు***

గిరిజన సంస్కృతి మన దేశానికి, రాష్ట్రానికి ఒక గొప్ప వారసత్వ సంపద, దాన్ని కాపాడుకోవడం మన బాధ్యత. అయితే, సాంప్రదాయం పేరుతో మూఢనమ్మకాలను, కుప్రథలను ప్రోత్సహించడం వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుంది, గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను, మెరుగైన ఉచిత వైద్య సదుపాయాలను మరింత అందుబాటులోకి తేవాలి, వారి స్థానిక భాషల్లోనే (కోయ, గొండి, వంటి భాషల్లో ప్రచారాలు చేస్తూ రోగాలకు కారణం మూఢనమ్మకాలు కాదని, సైన్స్ అని అర్థమయ్యేలా అవగాహన సదస్సులు నిర్వహించాలి వారి సాంప్రదాయ కళలకు, అటవీ ఉత్పత్తులకు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలి గిరిజనుల సాంప్రదాయ జ్ఞానానికి, ఆధునిక విజ్ఞానం మరియు విద్య తోడైనప్పుడే ఈ అద్భుతమైన సమాజం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుంది.

## మల్కాజిగిరి ప్రజావాణి కార్యక్రమంలో 44 ఫిర్యాదులు

**: జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్**



మల్కాజిగిరి, అక్టోబర్ 26,(విజన్ ఆంధ్ర) : మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్లకు సంబంధించి మొత్తం 44 ప్రజా ఫిర్యాదులను, అధికారులు స్వీకరించారు. ఇందులో కీసర సర్కిల్ 21, అల్వాల్ సర్కిల్ 02, మౌలాలి సర్కిల్ 10, మల్కాజిగిరి సర్కిల్ 11 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించి, ఫిర్యాదు దారులకు తక్షణ ఉపశమనం కల్పించేలా సంబంధిత అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జకియా సుల్తానా, డిప్యూటీ కమిషనర్, ఆర్.లక్ష్మణ్, సూపరింటెండింగ్ ఇంజనీర్, బి. శ్రీధర్ రావు, డిప్యూటీ డైరెక్టర్ (యుబీడీ), ఇ. లౌక్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జి. కవిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) టి. ప్రశాంతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. మంజుల, అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా. జి. రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్ (వెటర్నరీ) అజయ్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ) డి.శాంతి ప్రియ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 26 విజన్ ఆంధ్ర : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎ.ఈ.ఆర్.ఓ.లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ ప్రామాణికంగా 18 సంవత్సరాలు నిండిన, అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు జాబితాలో తప్పనిసరిగా ఉండాలని, అనర్హుల వివరాలు ఖచ్చితంగా ఉండకూడదని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎ.ఈ.ఆర్.ఓ.లు, సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేయడం జరుగుతుందని, నిర్ణీత గడువులోగా అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లాను 100% అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలి

**- కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 26 విజన్ ఆంధ్ర అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 8 నుండి 10 వరకు న్యూఢిల్లీలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ వారిచే నిర్వహించబడిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం మరియు ఉల్లాస్ మేళా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుండి కాసిపేట మండలం 100% అక్షరాస్యత కార్యక్రమంలో ఉత్తమంగా పనిచేసిన వాలంటరి టీచర్లు , నూతన అక్షరాస్యులు , డి ఆర్ పి బండ శాంకరీ , అప్పటి మంచిర్యాల జిల్లా వయోజనవిద్యాశాఖ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఏ. పురుషోత్తం కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్ ఐఏఎస్ వారిని అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి మంచిర్యాల జిల్లాను 100 శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

## జవహర్‌నగర్‌లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

***పనిచేయని బోర్‌వెల్ పంపులకు తక్షణ మరమ్మతులు చేయించాలి.***



జవహర్ నగర్ , అక్టోబర్ 26, విజన్ ఆంధ్ర,జవహర్‌నగర్ :డివిజన్‌లో భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడి సమస్యను నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డిని కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ పరిధిలోని వివిధ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి కొరత తీవ్రతరం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పలు కాలనీల్లో బోర్‌వెల్ పంపులు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలు రోజువారీ అవసరాలకు సరిపడా నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా పనిచేయని బోర్‌వెల్ పంపులను వెంటనే తనిఖీ చేసి మరమ్మతులు చేపట్టాలని, అన్ని కాలనీలకు క్రమబద్ధంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నీటి సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, సత్యం వంశరాజ్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, గజ్వేల్ శంకర్, మాజీ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్, పేరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.